ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
ఆదివారం 7 డిసెంబరు 2025

సొమ్ము ఒకరిది సోకు మరొకరిది అన్నట్లుగా గృహ నిర్మాణ శాఖలో పేదల సొమ్ముతో అక్రమార్కులు విలాసాలు చేస్తున్నారు. అసలు ఇళ్లే నిర్మించకుండా కొంత.. నాసిరకంగా నిర్మించి మరికొంత ప్రభుత్వ సొమ్మును దోచుకొని ఇళ్లు, ప్లాట్లు, కార్లు కొనుక్కొని జల్సాలు చేస్తున్నారు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా గత ప్రభుత్వంలో హౌసింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు ప్రజాధనాన్ని ఇష్టమొచ్చినట్లు దారిమళ్లించారు. ఈ భారీ కుంభకోణాలు ఇప్పుడు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. ఒక్క వెంకటేశ్వరపురం, కొండ్లపూడి లేఅవుట్లలో

రూ.కోట్ల ప్రజల సొత్తును కాంట్రాక్టర్లకు దోచిపెట్టడమే కాకుండా స్టీలు, సిమెంటు, ఇసుకను కూడా మాయం చేసిన హౌసింగ్ అధికారులపై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించడం, ఒకేసారి 13 మంది అధికారులపై ఛార్జస్ ఫ్రేమ్ చేయడం సంచలనంగా మారింది.



నెల్లూరు రూరల్ మండలం కొండ్లపూడిలో పునాదుల దశ దాటని ఇంటి నిర్మాణం

ప్రజల సొమ్ము.. వారి సోకు!



- గృహ నిర్మాణ శాఖలో వెలుగులోకి వస్తున్న అక్రమాలు
- పేదల డబ్బును దోచుకున్న అధికారులు, కాంట్రాక్టర్లు
- ఆ సొమ్ముతో విలాసంగా ఇళ్లు, కార్లు, ప్లాట్ల కొనుగోలు
- వారి ఆస్తులపై దృష్టి పెడితే ఇంకెంతో!

నెల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పేదల ఇళ్ల పేరుతో జరిగిన దోపిడీ.. తద్వారా సంపాదించిన సొమ్ముతో కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు జల్సాలతోపాటు వ్యాపారాలు కూడా మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ పీడీ స్థాయి అధికారి కోవూరు మండలం ఇనుమడుగు వద్ద మూడంతస్తుల భారీ భవంతిని నిర్మించారని, అలానే పలు చోట్ల ప్లాట్లు కొనుగోలు చేశారని హౌసింగ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. అలానే ఏ డీఈ స్థాయి అధికారి హరనాథపురంలో భారీ ఇంటిని నిర్మించడమే కాకుండా వివిధ ప్రాంతాల్లో ప్లాట్లపై పెట్టుబడులు పెట్టినట్లు గుసగుసలాడుకుంటున్నారు. ఇటువంటి వారు అనేక మంది ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలానే ఓ బడా



ఈ ఇల్లు ఇంతేనా!?

కాంట్రాక్టర్, అతడికి అన్నీ తానై నడిపిస్తున్న మరో వ్యక్తి కలిసి వందల ఎకరాల పొలాలను కొనుగోలు చేసిన ట్లు తెలుస్తోంది. అవసరాల కు మించి కార్లను కొనుగోలు చేయడమే కాక నెల్లూరులో భారీ సంఖ్యలో కేఫ్‌లు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. హౌసింగ్ శాఖలో పనిచేసిన ఓ రాష్ట్రస్థాయి అధికారికి సదరు కాంట్రాక్టర్ సుమారు రూ.3 కోట్లతో విల్లా నిర్మించి ఇచ్చినట్లు కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటువంటి అధికారులు, కాంట్రాక్టర్లపై అవినీతి నిరోధక శాఖ దృష్టి పెడితే ఇంకా అనేక బాగోతాలు వెలుగులోకి వస్తాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

● ఇష్టానుసారం దోపిడీ

గత ప్రభుత్వంలో లబ్ధిదారుడి అనుమతి లేకుండానే హౌసింగ్ అధికారులు ఇష్టానుసారం ఇళ్లను ఆప్షన్-3 పేరుతో వందల మంది కాంట్రాక్టర్లకు అప్పగించారు. సాధారణంగా ఆరు అంకణాల స్థలంలో బేస్ స్థాయి నిర్మాణానికి రూ.30 వేలకు మించి ఖర్చు కాదు. అయితే ఈ బీఎల్ స్థాయి నిర్మాణం జరిగితే తొలుత రూ.50 వేలు ఇచ్చే విధానం తీసుకొచ్చారు. ఆ తర్వాత దానిని రూ.70 వేలకు పెంచారు. ఈ క్రమంలో కాంట్రాక్టర్లు వేల ఇళ్లను బీఎల్ స్థాయి వరకూ నిర్మించి రూ.70 వేల లెక్కన బిల్లులు కొట్టేశారు. అయితే ఆ బేస్‌లను కూడా అత్యంత నాసిరకంగా నిర్మించినట్లు క్వాలిటీ కంట్రోల్ పరీక్షల్లో తేలుతోంది. బేస్ స్థాయికే ఇంత పెద్ద మొత్తం చెల్లించేలా నాడు హౌసింగ్ శాఖ నిర్ణయం తీసుకోవడం వెనుక కాంట్రాక్టర్లు ఉన్నారన్న ఆరోపణలున్నాయి. జిల్లాలో 97,445 ఇళ్లను మంజూరు చేయగా ఇంకా రిజిస్టర్ చేసుకోవాల్సినవి 18,755 వరకూ ఉన్నాయి. మరో 7546 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభం కాలేదు. ఇక 25 వేల వరకూ ఇళ్లు బేస్ లెవల్ లోపే ఉన్నాయి. ఇందులో 15 వేలకుపైగా ఇళ్లకు రూ.50 వేల నుంచి 70 వేల చొప్పున చెల్లించగా, మరో ఆరు వేల ఇళ్లకు రూ.30 వేల వరకూ పేమెంట్ చేసినట్లు తెలుస్తోంది. కొన్ని ఇళ్లు బేస్, లింటెల్ స్థాయిలోనే ఉన్నప్పటికీ అవి రూఫ్ స్థాయిలో ఉన్నట్లో లేక పూర్తయినట్లో చూపించి ఎక్సెస్ పేమెంట్లు చేసి ఉన్నట్లు బయటపడుతోంది. ఒక్క నెల్లూరు జిల్లాలో పేదల ఇళ్ల పేరుతో ఇప్పటి వరకూ సుమారు రూ.886 కోట్ల వరకు మెటీరియల్, బిల్లులు చెల్లించారు. అందులో ఒక కాంట్రాక్టర్‌కే రూ.200 కోట్లు వరకూ అందినట్లు సమాచారం. అయితే ఈ కాంట్రాక్టర్లు ఇప్పుడు ఇళ్లు పూర్తి చేసేందుకు ముందుకు రావడం లేదు. పేదల సొమ్ములతో ఇతర వ్యాపారాలు చేసుకుంటూ దర్జాగా తిరుగుతున్నారు. మిగిలిన నిర్మాణాలను పూర్తి చేయాలంటూ వీరికి నోటీసులు ఇస్తున్నా అసలు లెక్కపెట్టడం లేదు. పేదలు మాత్రం ఆ మొండి గోడలు చూస్తూ మథనపడుతున్నారు.

సాదాబైనామా సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సాదాబైనామా భూముల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాదా బైనామా భూముల విషయమై తహసీల్దార్లతో చర్చించారు. ఈ భూముల విషయంలో వీలైనంత వరకు హక్కుదారులకు న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. జిల్లాలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, సంక్రాంతి పండుగ తరువాత ఆ సమస్యలను కూడా శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

'సోమశిల'లో 73.999 టీఎంసీల నీరు

అనంతసాగరం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి శనివారం 22,676 క్యూసెక్కుల వరద కొనసాగింది. డ్యాంలో 73.999 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 19,950, కండలేరుకు 2,000 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సంగం : దిత్వా తుఫాన్ ప్రభావంతో ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వాగులు, వంకల్లో నుంచి వరద ప్రవాహం సంగం బ్యారేజీకి వచ్చి చేరుతోంది.



సంగం బ్యారేజీకి వస్తున్న వరద నీటి ప్రవాహం

బీరాపేరు, బొగ్గేరుతోపాటు ఇతర ఉప నదుల నుంచి సుమారు 17 వేలు, సోమశిల నుంచి 20 వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో బ్యారేజ్ వద్ద నీటిమట్టం 9.7 అడుగులు నమోదయింది. ఈ నీటిలో బీపీఆర్ (కావలి) కాలువకు 400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మిగతా నీటిని బ్యారేజి వద్ద 40 గేట్లు ఎత్తి దిగువ నెల్లూరు బ్యారేజికి విడుదల చేస్తున్నట్లు ఏఈ వినయ్ తెలిపారు.

● రాపూరు : కండలేరు డ్యాంలో 60.28 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 1750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1490 క్యూసెక్కుల నీటిని బయటకు విడుదల చేస్తున్నట్లు తెలిపారు.



ట్రంకు రోడ్డు సొగసు చూడ తరమా!



ట్రంకు రోడ్డు. నెల్లూరు నగరంలో ప్రధాన రహదారి ఇది. ఇటీవలే ఈ రోడ్డును బాగు చేశారు. అయితేనేం... పనుల్లో నాణ్యత కొరవడిందో ఏమోగానీ 'దిత్వా' తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్డుపై తారు లేచిపోయింది. అంతేగాక ఎక్కడపడితే కేవీఆర్ పెట్రోలు బంకు నుంచి అయ్యప్పగుడి వరకు ఎక్కడపడితే అక్కడ భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపై పడిన గుంతలను పూడ్చాలని నగరవాసులు కోరుతున్నారు.

- స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి నెల్లూరు

తిరుపతిలో కలపొద్దు.. ప్లీజ్!

8



● కలువాయిలో కొనసాగుతున్న ఆందోళనలు

నెల్లూరు జిల్లాలో ఉన్న కలువాయి మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దని కోరుతూ శనివారం కూడా ఆ ప్రాంత వాసులు ఆందోళన చేపట్టారు. ఉదయం ఏడీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, నిరసన వ్యక్తం చేశారు. అలాగే, సాయంత్రం ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, యువత కలసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పరమటివీధి నుంచి కొవొత్తులను పట్టుకుని ర్యాలీగా బస్టాండుకు చేరుకున్నారు. తిరుపతి వద్దు... నెల్లూరు ముద్దు, సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు.

కలువాయిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఉద్యోగులు, రాజకీయ నాయకులు తదితరులు

నేడు ఎన్ఎంఎంఎస్ పరీక్ష

● జిల్లాలో 3,685 మంది విద్యార్థులు

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) నిర్వహణకు విద్యా శాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఈ పరీక్షకు జిల్లాలో 18 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 3,685 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందుకు సంబంధించిన హాల్‌టికెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో, స్కూల్ లాగిన్‌లో, మనమిత్ర వాట్సాప్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యూడైస్ కోడ్‌ను ఉపయోగించి విద్యార్థుల హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసి అందచేసినట్లు డీఈఓ బాలాజీరావు తెలిపారు. విద్యార్థులు హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తీసుకుని కేంద్రానికి ఉదయం 9 గంటలలోపు చేరుకోవాలని పేర్కొన్నారు. ఓఎంఆర్ పత్రం బబ్లింగ్‌ను నీలం లేదా నలుపు పెన్‌తో మాత్రమే చేయాలని, సెల్‌ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురాకూడదని తెలిపారు.

గాడి తప్పుతున్న పోలీస్

- ప్రశాంత జిల్లాలో వరుస ఘటనలు
- రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌తో చర్యలకు ఆదేశం
- వరుసగా సస్పెన్షన్లు, వీఆర్‌కు పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా డీఎస్పీపై వేటు
- పలువురు అధికారులకూ చార్జ్‌మెమోలు
- ఇంకా జాబితా సిద్ధం చేస్తున్న ఎస్పీ

పోలీస్ వ్యవస్థ గాడి తప్పుతోంది. బాధితులకు న్యాయం సంగతి అటుంచితే అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంతమంది అధికారులు వ్యవహరిస్తున్నారు. దీనికితోడు జిల్లాలో నేరాలు పెరిగిపోవడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఈమేరకు ఉన్నతాధికారులు జల్లెడపట్టి మరీ అమ్యామ్యాలకు అలబాటుపడిన పోలీస్ అధికారులపై చర్యలకు ఉపక్రమించారు.

- 6లో..



మాలకొండ ఆదాయం రూ. 7,45,661

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనృసింహస్వామికి శనివారం భక్తుల నుంచి 7,45,661 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టోత్తరం టిక్కెట్ల ద్వారా రూ. 6,750, కుంకుమార్చన ద్వారా రూ. 18,160, వివాహముల ద్వారా రూ. 1000, తలనీలాలు ద్వారా రూ. 25,250, వాహనపూజలు ద్వారా రూ. 3,120, ప్రత్యేక దర్శనం ద్వారా రూ.1,85,900, స్థలపురాణం పుస్తకాల విక్రయం ద్వారా రూ.520, రూముఅద్దెలు ద్వారా రూ. 19,360, కవర్లు ద్వారా రూ. 7,900, లడ్డుప్రసాదం ద్వారా రూ. 1,67,225, అన్నదానం ద్వారా రూ. 3,10,476, విరాళముల ద్వారా రూ. 5,116 ఆదాయం లభించినట్లు ఆలయ డీసీ చంద్రశేఖర్ తెలియజేశారు

అవసరాల మేరకే యూరియా

పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు : కలెక్టర్

- వివరాలు 8లో..

విద్యార్థులకు పదోతరగతి తొలిమెట్టు. ఇందులో 'మార్క్' చూపాలని ప్రతి విద్యార్థి ఆశిస్తుంటాడు. ఆ మేరకు విద్యార్థిని తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక దృష్టి సారించింది. కార్యాచరణ సిద్ధం చేసి, మారిన సిలబస్‌ను దృష్టిలో ఉంచుకుని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సబ్జెక్ట్ టీచర్ల కొరత ఉన్న పాఠశాలల్లో సర్దుబాటుతో తాత్కాలిక ఏర్పాట్లు చేసి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడు తున్నారు. పరీక్షల షెడ్యూల్ కూడా విడుదల కావడం తో శనివారం నుంచి మార్చి 15వ తేదీ వరకు వందరోజుల ప్రణాళికను అమలు చేస్తున్నారు.



పదిలో వందకు ప్రణాళిక!

- ఉత్తమ ఫలితాల సాధనకు విద్యా శాఖ కసరత్తు
- విద్యార్థులు ఏ, బి, సీ, డీ గ్రేడులుగా విభజన
- వెనుకబడిన వారిపై ప్రత్యేక దృష్టి

నెల్లూరు(విద్య), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :తమ భవిష్యత్తుకు కీలకమైన పదోతరగతి పరీక్షలను ఓ సమరంలా భావించి విద్యార్థులు సన్నద్ధమవుతుండగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కూడా ప్రాధాన్యమిస్తూ వారిని సంసిద్ధులను చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీ నుంచి ప్రధాన పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మూడు నెలల వ్యవధిలో విద్యార్థులు పక్కా ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు వందరోజుల ప్రణాళికలను అనుసరిస్తున్నారు. జిల్లాలో ఈ ఏడాది 30వేల మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతుండగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యా శాఖ కృషి చేస్తోంది. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ రోజుకో సబ్జెక్ట్‌లో పునఃశ్చరణ పరీక్షలు రాయిస్తున్నారు. వాటిని ఎప్పటికప్పుడు సరిదిద్ది విద్యార్థుల లోపాలను మెరుగుపరుస్తున్నారు. వెనుకబడిన పిల్లలకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తున్నారు. శనివారం నుంచి ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 9గంటల వరకు పునఃశ్చరణ తరగతులు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అసైన్‌మెంట్లతో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎస్ఏ 1, 2 పరీక్షల్లో వచ్చిన మార్కులను పరిశీలించి ఏ సబ్జెక్ట్‌లో వెనుకబడి ఉన్నారో గుర్తిస్తున్నారు. ఈ పాఠ్యాంశాల్లో వారికి స్టడీ అవర్‌లో ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించిన సబ్జెక్ట్ ఉపాధ్యాయులకు ఇప్పటికే టైంటేబల్ కేటాయించారు. విద్యార్థులను ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లుగా విభజించి పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. ఇందులో ఏ, బీ గ్రూపులోని విద్యార్థులకు రోజువారీ తరగతులు కొనసాగిస్తున్నారు. సీ, డీ గ్రేడ్ విద్యార్థులకు స్టడీ అవర్స్‌తో పాటు వెనుకబడి ఉన్న సబ్జెక్టులలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. విద్యా శాఖ అధికారులు ఈ స్టడీ అవర్స్‌ను పర్యవేక్షించనున్నారు. విద్యార్థుల పఠనాశక్తి, ప్రోగ్రెస్‌లపై నివేదికలు సిద్ధం చేయనున్నారు. ఇక స్టడీ అవర్స్‌లో విద్యార్థులకు ప్రత్యేకంగా అల్పాహారం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు రకాలుగా ప్రణాళికలు



జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లోని టెన్త్ విద్యార్థులకు శనివారం నుంచి వందరోజుల ప్రణా ళికను అమలు చేస్తున్నాము. ముందుగా నిర్ణయించి టైంటేబుల్ ప్రకారం సబ్జెక్ట్‌పై అవగాహన కల్పించేలా ఆదేశాలిచ్చాము. సబ్జెక్ట్ నిపుణులు తయారు చేసిన ప్రశ్నపత్రాన్ని ఆన్‌లైన్‌లో తీసుకుని నిత్యం విద్యార్థులతో రాయిస్తున్నాము. ఈ ఏడాది రెండు రకాలుగా వందరోజుల ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తున్నాము. ఏ, బీ గ్రూప్ విద్యార్థుల కోసం షైనింగ్‌స్టార్స్ ప్రోగ్రాం, సీ, డీ గ్రేడ్‌ల విద్యార్థులకు రైజింగ్‌స్టార్స్ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాము. అంతర్గత మార్కుల వివరాలను తల్లిదండ్రులతో చర్చించి ప్రోగ్రెస్ కార్డులను అందించి ఇంటివద్ద విద్యార్థులు ఎలా సన్నద్ధం కావాలన్న విషయాలపై దిశానిర్దేశం చేస్తున్నాము.

- డాక్టర్ ఆర్.బాలాజీరావు, జిల్లా విద్యాశాఖాధికారి

సీజనల్ వ్యాధులపై అవగాహన ర్యాలీ

వెంకటాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొలగమూడి గ్రామంలో జీవీఆర్ఆర్ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో శనివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించి, అవగాహన అవగాహన కల్పించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జయభారత్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించే వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అధ్యాపకులు జాకీర్, సురేష్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12288
వెండి కిలో ధర	రూ. 183600
వెండి ఒక గ్రాము	రూ. 188.60

నిమ్మ రైతు విలవిల

● వరుస తుఫాన్లతో నిమ్మ రైతులకు తీరని నష్టం
● వానలకు తోడు తెగుళ్ల బెడద

పొదలకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 5వేల ఎకరాల్లో నిమ్మతోటలు సాగులో ఉన్నాయి. వీటిపై ఆధారపడి సుమా రు 3వేల మంది రైతులుజీవనం సాగిస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లో నిమ్మసాగును వీడకుండా రైతులు తమ జీవ నాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఈ ఏడాది వరుస తుఫా న్లు రైతులకు కోలుకోలేని నష్టాన్ని కలిగించాయనే చెప్పాలి. మొన్న మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాలకు నిమ్మతోటల్లో నీరు నిల్వ చేరడంతో చెట్లు దెబ్బతిన్నాయి. తోటల్లోని నీరు ఇంకిపోయి చెట్లు కోలుకుంటున్న తరుణం లో మళ్లీ దిత్వా తుఫాను వచ్చి పడింది. దీంతో నిమ్మ రైతు లు కోలుకునే పరిస్థితి లేకుండా పోయింది. మొంథా కంటే దిత్వా తుఫాను వల్ల నిమ్మ రైతులు తీవ్రంగా నష్టపో యారు. నిమ్మ తోటల్లో మోకాటి లోతున నీరు చేరడంతో రైతులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. నిమ్మ పాదుల్లో నీరు నిల్వ ఉండడం వల్ల వేరుకుళ్ల తెగులు వచ్చే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. నీరు పూర్తిగా ఇంకిపోయి బాగా ఎండ కాస్తేనే చెట్లు బతికే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.


పూతరాని నిమ్మచెట్లు


వేరుకుళ్ల తెగులు

● దిగుబడులపై ప్రభావం

నవంబరు, డిసెంబరు మాసాల్లో వర్షాలు ఎక్కువైతే నిమ్మతోటలు పూతకు రావు. పూతకు వచ్చినా నీటి శాతం ఎక్కువవడం వల్ల పూత రాలిపోతుంది. ఈ కారణంగా వేసవిలో మంచి ధరలు పలికే సమయంలో కాయలు లేకుండా పోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. సాధారణంగా పూతపూసిన నాలుగు మాసాలకు కాయలు కోతకు వస్తాయి. ఇప్పుడు పూత పూస్తే మంచి డిమాండ్ ఉండే మార్చి, ఏప్రిల్ మాసాల్లో కాయలు దిగుబడి వస్తాయి. ఆ సమయం ధరలు ఉండి రైతులు ఆర్థికంగా కొంత నిలదొ క్కుకుం టారు. అయితే పూత లేకపోవడం వల్ల రైతులు ఆందోళనవ్యక్తం చేస్తున్నారు. వర్షాలకు తోటల్లో మందులు పిచికారి చేసేందుకు కూడా వీల్లేకుండా పోయింది. దీంతో పెనుబంక, గజ్జి తెగులు, వేరు కుళ్ల సోకి నిమ్మ చెట్లు పాడైపోతున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

●ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని, ఆ దిశగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం ప్రజా దర్బారు కార్యక్రమం జరిగింది. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్య క్రమంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు, టీడీపీ మండల అధ్యక్షులు నాపా వెంకటేశ్వర్లు నాయు డు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కరకట్ట మల్లి కార్జునరావు, ఎంపీటీసీ రాజా, వెంకట రమణారెడ్డి, వినీల్, సతీష్‌రెడ్డి, మదన్‌తోపాటు పాల్గొన్నారు.

కోవూరు: స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి శనివారం రాత్రి ఆకస్మి క తనిఖీ చేశారు. గర్భిణీలు, కాన్పు చేసుకున్న తల్లులతో మాట్లాడారు. మౌలిక సదుపా యాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట పెన్నా డెల్టా ఛైర్మన్ జెట్టి రాజ గోపాలరెడ్డి, టీడీపీ నాయకులు సుధాకరరెడ్డి, ఇంతా మల్లారెడ్డి, అశోక్ కుమార్ తదితరులున్నారు.


ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

కండలేరు కాలువను బాగు చేయాలి

ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కండలేరు కాలువను స్పిల్‌వే నుంచి క్రీక్ వరకు పూడికతీసి, విస్త రించేలా వెంటనే జిల్లా అధి కారులు చర్యలు చేపట్టాల ని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. మం డలంలోని తీరప్రాంత గ్రామా లలో శనివారం ఆయన పర్య టించారు. కొలనుకుదురు వద్ద బోటులో వెళ్లి నీటమునిగిన పొలాలను పరి శీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొలాలను కాదు.. సముద్రాన్ని చూసి నట్లుందని, సర్వేపల్లి నియోజకవర్గంలో దిత్వా తుఫాన్‌కు ముత్తుకూరు, వెంక టాచలం, మనుబోలు మండలాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మనుబోలు మండలంలో 11 వేల ఎకరాల్లో నారుమడులు, 2 వేల 300 ఎకరాల్లో నార్లు దెబ్బతిని రైతాంగం నష్టపోయిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులకు ఇప్పుడు రైతులు అనుభవిస్తున్నారన్నారు. ఇరిగేషన్‌లో గత పాలకులు కాలువ పనులు చేయకుండానే రూ. 150 కోట్లు దాకా కాజేశారని ఆరోపించారు. రైతులకు విత్తనాలు ఇవ్వాలని ఇప్పటికే వ్యవసాయ మంత్రిని కోరామన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. అనంతరం దళిత, గిరిజన కాలనీల్లో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ ఛైర్మన్ వద్దినేని మస్తాన్‌నాయుడు, నాయకులు కసిరెడ్డి సునీల్‌రెడ్డి, నిఖిల్‌రెడ్డి, సురేష్, అల్లాభాషా, హనుమంత నాయుడు, శేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.


పొలాల పరిశీలనకు పడవలో వెళుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

గిరిజమ్మ మృతదేహానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

వరదల కారణంగా సకాలంలో వైద్యం అందక మృతిచెందిన గిరిజమ్మ మృతదేహానికి శనివారం ఎమ్మెల్యే సోమిరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్డుమార్గంలో నీళ్ళే లేకుంటే చికిత్స కోసం తీసుకెళ్లి బతికించుకుని ఉండేవాళ్ళమని మృతురాలి పిల్లలు ఎమ్మెల్యే ముందు ఆవేదన చెందారు. తమ కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబసభ్యులు ఎమ్మెల్యేను కోరారు. ఈ సంఘటనపై నివేదిక తయారు చేయాలని తహసీల్దార్ రమాదేవిని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జలజాక్షి, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయ సిద్ధ మంగళ పూర్ణాహుతి హోమం

ఇందుకూరుపేట : మండలంలోని మైపాడు సముద్ర తీరంలో దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో రామానంద భారతి స్వాముల సమక్షంలో దత్తాత్రేయ సిద్ధ మంగళ పూర్ణా హుతి హోమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి హోమంలో పాల్గొని రామానంద భారతి స్వామిచే వేదాశీర్వాదాలు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరుపేట టీడీపీ అధ్యక్షు డు ఏకొల్లు పవన్‌కుమార్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు చెంచుకిషోర్ యాదవ్, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, అమ్మ హేచరీస్ అధినేత దుర్గా శంకర్‌రెడ్డి, సురేంద్ర, బొద్దుకూరు సుధాకర్, ముంగర గోపాల్, మధు పాల్గొన్నారు.


వేదపండితుల ఆశీర్వాదం అందుకుంటున్న ఎమ్మెల్యే ప్రశాంతి

దెబ్బతిన్న నారుమళ్ల పరిశీలన

పొదలకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇటీవల దిత్వా తుఫాను వల్ల దెబ్బతిన్న నారుమడులు, నాటిన వరి, జొనన పంటను నెల్లూరుజిల్లా కృషి విజ్ఞాన్ కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త లలిత శివజ్యోతి శనివారం పరిశీలించారు. మండలంలోని మహమ్మదాపురం, తాటిపర్తి, నల్లబాలెం, పొదలకూరులో పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.ప్రతాప్, పొదలకూరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త వి.సురేఖ, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి రామమోహన్, వ్యవసాయ విస్తరణ అధికారి బి.రాజమోహన్‌రెడ్డి, ఏడుకొండలు నాయక్, వీఏఏ గోవర్ధన్, సురేంద్ర, ఇంద్రజ, రైతులు తురక బాలయ్య, రమణయ్య, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కోవూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల్ని పరిష్కరించాల్సిందిగా ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బండారుపల్లి వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక ఎన్జీఓ హోమ్‌లో ఆయన కోవూరు తాలూకా ఎన్జీఓ సంఘం ఎన్నికల సందర్భంగా మాట్లాడారు. ఉద్యోగులందరూ ఐక్యతతో ఏపీ ఎన్జీఓ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు ఆంజనేయవర్మ, కార్యదర్శి గజరాజు రామకృష్ణ మాట్లాడారు. ఎన్నికల అధికారిగా పీ రామిరెడ్డి వ్యవహరించారు.

మట్టి పరీక్ష.. పంటకు రక్ష..

రాపూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు తప్పనిసరి అని జిల్లా వనరుల కేంద్రం ఏడిఏ మారుతి దేవి పేర్కొన్నారు. శనివారం రాపూరు మండలంలోని ఆదూరుపల్లి, కండలేరు గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త అనిషా, రాపూరు వ్యవసాయ అధికారి సోము సుందర్, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే కాకాణి పొలాల పరిశీలన

మనుబోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన మనుబోలులో తుఫాన్ కారణంగా నీటమునిగిన నార్లు, నారుమడులను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఎంపీపీ గుండాల వజ్రమ్మ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి రూ. 2 లక్షల విరాళం

రాపూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రం నందు భక్తుల సౌకర్యార్థం శ్రీవార్ల నిత్యాన్నదాన పథకానికి నెల్లూరు జడ్పీ కాలనీకు చెందిన మలిశెట్టి కాంతమ్మ, మలిశెట్టి శ్రీలత జ్ఞాపకార్థం మలిశెట్టి పాపయ్య శ్రీవార్ల నిత్యాన్నదాన పథకమునకు రూ. 2 లక్షల నగదు రూపంలో ఆలయ ఉప కమిషనర్ కు అందించారు.



కలియుగ దైవంతో పెట్టుకుంటే ఆనవాళ్లు ఉండవు!

ముత్తుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కలియుగ దైవంతో పెట్టుకోవద్దు జగన్... ఆనవాళ్లు లేకుండా పోతావని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు హెచ్చరించారు. కప్పలదొరువులో వెలసి వున్న శ్రీకలియుగ దైవం ఆ వెంకటేశ్వరస్వామి సన్నిధిలో శనివారం కొబ్బరికాయలు కొట్టి జగన్ మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని ప్లకార్డులతో నిరసనను తెలియజేశారు. పరకామణిలో జరిగిన దొంగతనం గురించి జగన్ మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ గుమ్మినేని వాణి భవానీ నాయుడు, సందూరి శ్రీహరి, నాయకులు రహీంద, అశోక్, శ్రీను, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాడవాడలో అంబేడ్కర్‌కు ఘన నివాళి

కోవూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా పలుచోట్ల ఘనంగా నివాళులర్పించారు. స్థానిక దళిత కాలనీ సమీపంలోని అంబేద్కర్ విగ్రహానికి బీఎస్పీ జిల్లా కార్యదర్శి కడింపాటి అశోక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, ఆయన చూపిన మార్గంలో పయనించాలన్నారు. బీఎస్పీ నాయకులు కడిం పాటి అనిల్, ముదివర్తి కృష్ణమూర్తి తదితరులున్నారు. అంబేద్కర్ పూర్ పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జూగుంట విజయానందం ఆధ్వర్యంలో లవకుమార్ నివాళులర్పించారు. టీడీపీ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సభలో టీడీపీ పార్లమెంటు కమిటీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వేంకటేశ్వర్లు రెడ్డి, నాయకులు విజయ్, సత్యనారాయణరెడ్డి, మధుసూదన్, సాయి రోశయ్య పాల్గొన్నారు.

వెంకటాచలం : బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన మహనేత బీఆర్ అంబేద్కర్ అని ఎంపీడీఓ కల్పన కొనియాడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం అంబేద్కర్ చిత్రపటానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో కలిసి ఆమె నివాళులర్పించారు. అనంతరం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించగా పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పొట్లూరు సుబ్రహ్మణ్యం, ఎంపీపీ మందా కవిత, వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, చవటపాళెం పీఏసీఎస్ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ చల్లా నాగార్జునరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ కల్పన తదితరులు

మనుబోలు: రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతిని మనుబోలులో దళితవాడ వద్ద శుక్రవారం దళితనాయకులు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత నాయకులు రాయపాటి కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, పరిమళ శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాపూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయం దగ్గర గల అంబేద్కర్ విగ్రహానికి మండల బీజేపీ నాయకులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అగర్త కట్ట స్కూల్ పిల్లలకు పలకలు, పుస్తకాలు అందచేశారు. మండల బీజేపీ అధ్యక్షుడు దూడల పెంచలయ్య, ప్రధాన కార్యదర్శులు వెంకటరత్నం నాయుడు, మనుబోలు శివ ప్రసాద్, ఉపాధ్య క్షుడు మాదిరెడ్డి ఆదిరెడ్డి, తిరుపతి జనార్ధన్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ దొడ్ల కోదండరామిరెడ్డి, ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ పద్మజ బీఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బుచ్చిపెద్దూరులోని దళితవాడలో స్థానిక యువకులు నివాళులర్పించారు.

ఇందుకూరుపేట : కొత్తూరు అంబేద్కర్ కాలనీలో శనివారం మండల బీజేపీ అధ్యక్షులు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు, హెచ్ఐవీపై అవగాహన సదస్సు

తోటపల్లిగూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : లెప్రసీ, ఎయిడ్స్, టీబీ వైద్య అధికారి డాక్టర్ ఖాదర్‌వల్లి మండలంలోని నరుకూరు గ్రామంలో శనివారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను పరిశీలించారు. నరుకూరు ఇందిరమ్మ కాలనీ, జానవారిపాలెంలో జరుగుతున్న ఎన్‌సీడీ సీడీ4.0 సర్వేని పరిశీలించారు. కుష్ఠు, హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ జీ. విజయ్ కుమార్, ఆరోగ్య సిబ్బంది సీహెచ్ఓ లహరి, ఏఎన్ఎం ప్రశాంతి, ఆశా కార్యకర్త విజయ లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వెంకటాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే లక్ష్యంగా టీడీపీ ప్రభుత్వం పని చేస్తోందని చవటపాళెం పీఏసీఎస్ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు అన్నారు. వెంకటాచలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) కార్యాలయంలో శనివారం రైతులకు రుణాలకు సంబంధించిన చెక్కులను ఆయన అందజేశారు. సీజనల్ వారీగా రైతులకు రుణాలు, ఎరువు లు అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్య క్రమంలో చవటపాళెం పీఏసీఎస్ డైరెక్టర్ నాగరాజు, సీఈఓ రవిచంద్ర పాల్గొన్నారు.



చెల్లాయపాళెం ఊటుకాలువలో పూడిక తీత

బుచ్చిరెడ్డిపాళెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెల్లాయపాళెం ఊటుకాలువలో పేరుకుపోయిన తుంగ, తూటాకు, గుర్రపుడెక్క, ముళ్ళపొదలను ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ సంగం మండలంలోని ముంపునీరు వ్యవసాయ పొలాలపై పడటంతో వరినాట్లు, నారుమళ్లు ముంపునకు గురయ్యాయి. దీంతో టీడీపీ నాయకులు పప్పు మౌళి, అమరనాథరెడ్డి, రైతులు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డితో మొరపెట్టుకున్నారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే శనివారం ఎక్సకవేటర్‌ను పంపించి పూటికతీతకు ఆదేశించారు. ఆ మేరకు పనులు జరుగుతున్నాయి.

'గండికోట'కు బొల్లిముంతల పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం: స్థానిక మున్సిపాలిటీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ 'బొల్లిముంత' పురస్కారం అందుకున్నారు. తెనాలిలో రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక సంస్కృతి సమితి నిర్వహించిన కార్యక్రమంలో గండికోటకు బొల్లిముంత శివరామకృష్ణారావు పురస్కారాన్ని అందజేసి అభినందించారు. ఎంఈఓలు, దిలీప్‌కుమార్, పీవీ రత్నం సాహితీవేత్తలు గండికోటను అభినందించారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు

విడవలూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. మండలపరిధిలోని వరిణి రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వే నెం. 1604లో ఉన్న డొంక పోరంబోకు భూమిని ఆక్రమించుకున్నారని ఓ వ్యక్తి హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు డొంకపోరంబోకు భూమిని రెవెన్యూ అధికారులు సర్వే చేసి ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలంను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని, కోర్టు ఆదేశాల మేరకు ఆర్ఐ అబ్దుల్ సలాం, విఆర్‌వో నరసయ్య, విఆర్ఏ బోర్డులు ఏర్పాటు చేశారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఇందుకూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కొత్తూరు జిల్లాపరి షత్ హైస్కూల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం శనివారం జరిగింది. జిల్లా అడిషనల్ ప్రాజెక్టు అధికారి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఎంఈవో సునీల్ కుమార్, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున పాల్గొన్నారు.

మనుబోలు: స్థానిక భవిత కేంద్రంలో జాతీయ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల దినోత్సవం నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు విజయ్‌కుమార్ రెడ్డి భోజనం ఏర్పాటు చేశారు. ఐఈఆర్పీలు శ్యామల, షర్మిల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి విత్తనాలు ఉచితంగా అందించాలి

తోటపల్లిగూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీపీఎం పార్టీ కమిటీ, రైతు సంఘం నాయకులు గ్రామాల్లో శనివారం నరుకూరు, పేడూరు, తోటపల్లి గూడూరు గ్రామాల్లో దిత్వా తుఫాను దాటికి మునిగిపోయిన నారుమడులను, వరినాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు బండి సౌరీ, రాజా, మోచర్ల రాధయ్య, రైతులు పాల్గొన్నారు.

గాడితప్పుతున్న పోలీస్

ప్రశాంత జిల్లాలో వరుస ఘటనలు

రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌తో చర్యలకు ఆదేశం

వరుసగా సస్పెన్షన్లు, వీఆర్‌కు పోలీసులు



నెల్లూరు(క్రైం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణ, ఆస్తికి రక్షణగా నిలవాల్సిన పోలీసులే గాడితప్పుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి విధులను గాలికి వదిలేస్తున్నారు. జిల్లాలో పోలీసు శాఖలో వరుసగా సస్పెన్షన్లు వీఆర్‌లు, బదిలీలు, చార్జ్ మెమోలు అందుకోవడం ఇందుకు నిదర్శనం. ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లా గత కొన్ని సంవత్సరాలుగా నేరాలకు, ఘోరాలకు అడ్డాగా మారిపోయింది. పట్టపగలే హత్యలు జరుగుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. వరుసగా జరుగుతున్న ఘటనలతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

● ఎన్ని కేసులో...

రౌడీషీటర్ శ్రీకాంత్, లేడీ డాన్ అరుణలకు సహకరించిన ఏఆర్ ఏఎస్పీ మునిరాజ వీఆర్‌కు వెళ్లగా, నలుగురు ఏఆర్ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. గతంలో ఏఆర్ హోంగార్డు ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఓ ఏఆర్ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆ ఆర్ఐ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా పోలీసులు కేసు నమోదు చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అయితే విచారణలో నిజమని తేలడంతో ఆ ఇద్దరిని పోలీసు శాఖ నుంచి డిస్మిస్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన జంటహత్యల పరిణామంలో ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావుతోపాటు ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ మల్లిఖార్జునను సస్పెండ్ చేశారు. ఇక ఇటీవల విడవలూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి నెల్లూరులోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయన్ను ఎస్పీ అజిత సస్పెండ్ చేశారు. ఈ అంశాలు పక్కన పెడితే గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచురామారావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డీజీపీ సస్పెండ్ చేశారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇక ఇటీవలే నెల్లూరు సీసీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించిన నిరంజన్‌ను సస్పెండ్ చేశారు. అలాగే, నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను సైతం 20 రోజులకుపైగా స్టేషన్‌కు రావద్దని ఎస్పీ ఆదేశించడం విశేషం. అదే స్టేషన్లఓ ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను అవినీతి ఆరోపణల నేపథ్యంలో డీసీఆర్‌బీకి అటాచ్ చేశారు. ఆవెంటనే జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో ఉన్న ఐడీ పార్టీలు, క్రైమ్ పార్టీల వివరాల జాబితాను ఎస్పీ తీసుకోవడంతో మరింత మందిపై వేటు పడుతుందన్న ఆందోళన ఇటు అధికారులు, సిబ్బందిలోనూ నెలకొంది.

● అధికారులకు చార్జ్ మెమోలు

జిల్లా ఎస్పీగా డాక్టర్ అజిత వేజెండ్ల బాధ్యతలు చేపట్టిన తర్వాత నేర నియంత్రణలో విఫలమవుతున్న పోలీసు అధికారులకు వరుసగా చార్జ్ మెమోలు జారీ చేస్తున్నారు. నేరం జరిగిన వెంటనే నిందితులను అరెస్ట్ చేయలేక పోవడం, నేరం జరుగుతుందని ముందుగా ఎందుకు గుర్తించలేక పోయారు, అవినీతి ఆరోపణలు, ఇలా అనేక అంశాలపై పోలీసు అధికారులకు చార్జ్ మెమోలు వరుసగా అందిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమవుతున్నారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి

కావలి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందిన సంఘటన శని వారం కావలి రైల్వే స్టేషన్లో జరిగింది. లోకో పైలెట్ జీఆర్పీ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే స్టేషన్లోని మూడవ లైన్ ట్రాక్ దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు బులుగు రంగు చొక్కా, తెల్లని కట్ బనియన్, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతికి నల్లని పూసల తాడు, కుడికాలికి నల్లటి దారం కట్టుకున్నాడు. ఎడమచేతిపై షా అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు 944062 7648 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.


రైలు పట్టాలపై పడి ఉన్న వ్యక్తి మృతదేహం

బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

కలువాయి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పి ంచే ప్రయత్నంలో ఆర్టీసీ బస్సు రోడ్డు దిగి చక్రాలు బురదలో కూరుకుపోవడం తో ఒక వైపునకు ఒరిగిన సంఘటన మండలంలోని ముక్కుతిప్ప వద్ద శనివారం చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

పెంచలయ్య హత్య కేసులో మరొకరి అరెస్ట్

నెల్లూరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కల్లూరిపల్లి వద్ద నవంబరు 27వ తేదీన పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాలో మరో వ్యక్తిని శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనలో మొత్తం 18 మందికి సంబంధం ఉన్నట్లు పోలీసులు తేల్చారు. తాజాగా నగరంలోని కపాడిపాళెంకు చెందిన నిఖిల్‌ను అరెస్ట్ చేశారు. దీనితో ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మరో నలుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ గుంజి వేణు తెలిపారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలపై సమాచారం అందుకున్న ఎస్పీ ప్రత్యేక బృందంతో పాటు ఆ పరిధిలోని పోలీసు స్టేషన్‌ల అధికారులు శనివారం రాత్రి దాడులు చేశారు. నగరంలోని నిప్పో సెంటర్ పుట్టవీధి పరిధిలోని ఎవ్‌రీడే స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టి పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని జగదీష్ నగర్‌లో యూనిక్స్ సెలూన్ స్పాపై దాడి చేసి ముగ్గురు యువతులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు సుధీర్‌పై కేసు నమోదు చేస్తున్నామని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. రామలింగాపురంలోని వీఐపీ స్పాపై దాడి చేసి ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకొని నిర్వాహకురాలైన కృష్ణవేణిపై కేసు నమోదు చేశారు. పోలీసుల దాడులతో పలువురు స్పాల నిర్వాహకులు స్పా సెంటర్‌లకు తాళాలు వేసుకొని పరారయ్యారు. ఈ దాడుల్లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294
కోడిగుడ్ల ధర (100): 670	

విద్యార్థులకు పలకల పంపిణీ

నెల్లూరు(వెంకటేశ్వరపురం) డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : ఉన్నత చదువుల వలనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఉన్నత శిఖరాలకు చేరుకొన్నారని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు జమీర్ పేర్కొన్నారు. నగరంలోని 54వ డివిజన్ జేఆర్ కాలనీలోని పాఠశాలలో అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల ఐక్యసంఘం అధ్యక్షుడు సనావుల్లా, బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్, ఉపాధ్యాయులు గౌసిన్నిసా, ఆయేషా, రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పలకలు పంపిణీ చేసిన దాతలు


రాజీవ్ గృహకల్ప వద్ద పేరుకుపోయిన మురుగు, వ్యర్థాలు


పెచ్చులూడుతున్న రాజీవ్ గృహకల్ప భవనం


పెరుగుతున్న గండి, మడుగులా మారిన మురుగు

'రాజీవ్ గృహకల్ప'లో సమస్యల తిష్ఠ!

- పెచ్చులూడుతున్న భవనాలు
- నివాసాల చుట్టూ మురుగు
- వ్యర్థాలతో పూడిపోయిన కాలువలు
- దుర్గంధంతో అల్లాడుతున్న ప్రజలు
- పెరుగుతున్న విషసర్పాలు, దోమలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇరుకళ పరమేశ్వరి ఆలయం సమీపంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో సమస్యలు తిష్ఠ వేశాయి. దీంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దాదాపు 20 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గృహకల్ప నివాస సముదాయాన్ని నిర్మించింది. ప్రస్తుతం ఈ నివాసాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుతున్నాయి. అనేక భవనాలు పెచ్చులూడుతున్నాయి. పలుమార్లు స్థానికులపై పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. నివాసాల చుట్టుపక్కల పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. ఎక్కడ మురుగునీరు అక్కడే నిలిచిపోతుంది. నివాసాల దగ్గర ఏళ్ల తరబడి వ్యర్థాలు, మురుగునీరు నిల్వ చేరడంతో దుర్గంధంతో పాటు, దోమలు అధికంగా ఉత్పత్తి చెందుతున్నాయి. డ్రైనేజీ కాలువలు అన్నీ పూడిపోయి మురుగు నీరు ముందుకు కదలక మడుగును తలపిస్తోన్నాయి. నివాసాల చూట్టూ గుర్రపు డెక్క, పిచ్చిమొక్కలు పెరిగిపోయి అందులోంచి విషసర్పాలు, పురుగులు వస్తున్నట్లు స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. కాస్త వర్షం కురిస్తే చాలు నీరు మొత్తం నివాసాల ముందు చేరుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు ఈ ప్రాంత సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆధునిక మరుగుదొడ్లు

- రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ


ఆత్మకూరు బస్టాండ్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(సిటీ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : నగరంలో రద్దీగా ఉండే ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. శనివారం ఈ ప్రాంతంలో పర్యటించిన ఆయన మాట్లాడారు. ప్రయాణికులతో పాటు ప్రజలు ఉపయోగించుకునే విధంగా మరుగుదొడ్లను అత్యాధునిక పద్ధతుల్లో నిర్మించాలని సూచించారు. ఈ ప్రాంతంలో రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇవన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం మైపాడు రోడ్డులోని స్మార్ట్ స్ట్రీట్ బజారును మంత్రి నారాయణ ఆకస్మికంగా పరిశీలించారు. అక్కడి దుకాణదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్ర మంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, ఇతర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

● వెంకటేశ్వరపురాన్ని నెం.1గా తీర్చిదిద్దడమే లక్ష్యం

నెల్లూరు(వెంకటేశ్వరపురం) : ఎక్కువ మంది పేదలు నివాసాలు ఉన్న నగరంలోని వెంకటేశ్వరపురం 53, 54 డివిజన్లను నెంబర్ 1గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి నారాయణ పేర్కొన్నారు. శనివారం సాయంత్రం గాంధీ గిరిజనకాలనీ సమీపంలోని ఓ ఫక్షన్ హాల్‌లో 53, 54 డివిజన్‌లలో నివాసాలు ఉంటున్న గిరిజనులు, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. గతంలో భగత్‌సింగ్‌కాలనీ ప్రాంత ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వర్చువల్‌గా పట్టాలు అందజేశారన్నారు. రెండో విడతగా 134 మందికి, 53వ డివిజన్‌లోని గిరిజనులకు 88 మందికి పట్టాలను అందించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇళ్లు లేని ప్రతీ పేదవారికి సొంత ఇల్లుం కల్పించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమన్నారు. పేదల కష్టాలు తనకు బాగా తెలుసని... తానూ ఓ పూరిగుడిసెలో నుంచి వచ్చినవాడినేనన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనూష, కమిషనర్ నందన్, స్థానిక కార్పొరేటర్‌లు దేవరకొండ సుజాత, సఫియామూజీర్, క్లస్టర్ ఇంచార్జ్ జహీర్, కో ఆప్షన్ సభ్యుడు జమీర్, నాయకులు ముజీర్, అశోక్, మునీర్, తదితరులు పాల్గొన్నారు.

ఐజీ త్రిపాఠిని కలిసిన ఎమ్మెల్సీ బీద రవిచంద్ర


ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర శనివారం గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠిని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ డాక్టర్ అజితా వేజెండ్లతో చర్చించిన తర్వాత పోలీసు అధికారుల సేవల నిర్వహణను బలోపేతం చేసేందుకు బీఎంఆర్ సంస్థలు, మిత్రుల సహకారంతో ఐదు బొలేరో నియో వాహనాలను పోలీసు శాఖకు అందజేస్తున్నామని ప్రకటించారు. ఈ వాహనలను అల్లూరు, బోగోలు, దగదర్తి, కావలి రూరల్ సర్కిల్ పోలీసు స్టేషన్, కావలి రూరల్ స్టేషన్లకు అందిస్తున్నామని తెలిపారు. అధికారులు తమ విధుల్లో ఉన్నప్పుడు త్వరితగతిన స్పందించేదుకు, గ్రామీణ ప్రాం తాలకు సులభతరం వెళ్లేందుకు, ప్రజా సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు ఈ వాహనాలు దోహదపడుతాయన్నారు. ప్రజా భద్రత, శాంతి పరిరక్షణలో ముందు వరుసలో సేవలు అందిస్తున్న పోలీస్ శాఖకు ఈ సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు.

కార్పొరేషన్‌లో ఆధార్ నమోదు కేంద్రం ఏర్పాటు


ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శనివారం కమిషనర్ నందన్, అమృత పథకం డీడీ మాధురి ప్రారంభించారు. ఆధార్‌లో అనేక సవరణలు చేసుకోవాల్సిన ప్రజలు ఈ కేంద్రాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం దీనిని అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ముందుగా బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులర్పించారు. అనంతరం నగరంలోని కాపు వీధి, ట్రంకు రోడ్డు ప్రాంతాలలో భవనాలను పరిశీలించా రు. పన్ను, అనుమతులపై ఆరా తీశారు. అలాగే పలు ప్రాంతాలలో పారిశుధ్య పను లను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పెంచలయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి

నెల్లూరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):గంజాయి బ్యాచ్ చేతుల్లో ప్రాణా లు కోల్పోయిన పెంచలయ్య కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాం డ్ చేశారు. శనివారం కల్లూరిపల్లి వద్దనున్న ఆర్టీటీ కాలనీలో పెంచలయ్య కుటుంబాన్ని వారు పరామర్శించారు. అనంతరం పెంచలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ చట్టం ప్రకారం పెంచలయ్య కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, పరిహారం, ఇంటి స్థలం ఇచ్చేందుకు కలెక్టర్ జోక్యం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, సుబ్బారావు, రఘు పాల్గొన్నారు.

జనవరి 5న పొట్టేపాళెం వద్ద

వంతెన నిర్మాణానికి శంకుస్థాపన

● రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు-జొన్నవాడ రహదారిలో పొట్టేపాళెం వద్ద నెల్లూరు కలుజుపై జనవరి 5వ తేదీన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని ఆయన కార్యాయంలో మీడియాతో మాట్లాడారు. సుమారు రూ.5 కోట్లతో ఈ వంతెన నిర్మించనున్నట్లు తెలిపారు. 8 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. జిల్లాలోని సగం ప్రాంతానికి జఠిల సమస్యగా మారిన పొట్టేపాళెం కలుజు వద్ద వంతెన లేక అనేక మంది ప్రయాణికులు, ప్రజలు నరకయాతన అనుభవించారని తెలిపారు. దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యకు కూటమి పార్టీల ప్రభుత్వంలో పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన సీఎం చంద్రబాబు, జిల్లా మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీ, ఐఏఎస్ అధికారులు, ఇతర అనుబంధ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే నెల్లూరు-తాటిపర్తి రహదారిలో ములుముడి వద్ద కలుజుపై వంతెన నిర్మించాల్సి ఉందని చెప్పారు. అందుకోసం తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నామని, అది కూడా మంజూరవుతుందన్న నమ్మకం ఉందన్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయ్యేలోపు అక్కడ కూడా వంతెన నిర్మాణానికి అనుమతులు పొందుతామని ధీమా వ్యక్తం చేశారు. మరికొన్ని ప్రాంతాల్లో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు మొదలవుతాయని తెలిపారు. నియోజకవర్గంలోని మున్సిపల్ పరిధి లో మరొకసారి ఏక కాలంలో భారీ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేపట్టబోతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పముజుల ప్రదీప్, జలదంకి సుధాకర్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులు


అంబేడ్కర్ భవన్‌లో వస్త్రదానం చేస్తున్న నావూరు శైలేంద్రబాబు, తదితరులు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నగరంలో వాడవాడలా పెద్ద ఎత్తున నిర్వహించారు. కొందరు వస్త్రదానం, అన్నదానం చేయగా, కొందరు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో..

నగరంలోని మినీ బైపాస్ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ నాయకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం మూలంగానే నేడు బడుగు బలహీన వర్గాలు గౌరవంగా జీవిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాతంగి కృష్ణ, మీదూరు ప్రశాంత్, అరవ కిషోర్, జగన్, నన్నేసాహెబ్, ప్రమీల, సురాబత్తిన రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

● ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో..

ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కనకట్ల రఘురాం ముదిరాజ్ నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘురాం ముదిరాజ్ మాట్లాడుతూ నేటి యువత అంబేడ్కర్ ఆశయసాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీవీ కృష్ణయ్య, దద్దోల రమణయ్యగౌడ్, నలుబోలు బలరామయ్యనాయుడు, పాబోలు సత్యం, కనకరాజు, తిరుపతి శేఖర్, ఒంగోలు నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

● అంబేడ్కర్ భవన్‌లో వస్త్రదానం...

స్థానిక అంబేడ్కర్ భవన్‌లో తెలుగుదేశంపార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ నావూరు శైలేంద్రబాబు ఆధ్వర్యంలో పేదలకు వస్త్రదానం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ, జ్యోతి సోమశేఖర్, ఉదయగిరి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

● మాలమహానాడు ఆధ్వర్యంలో..

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య ఆధ్వర్యంలో నాయకులు నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్వర్ణా వెంకయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ చిరస్మరణీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న స్వర్ణ వెంకయ్య, తదితరులు

● మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో...

మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ మాట్లాడుతూ సమసమాజ స్థాపన కోసం అంబేడ్కర్ ఎంతగానో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో మామూడూరు కన్యకేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

నెల్లూరు(వైద్యం) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ పేర్కొన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా నగరంలోని అంబేడ్కర్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నేతలు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నేతలు మోహన్‌రెడ్డి, షేక్ ఫయాజ్, పప్పర్తి గణేష్‌బాబు, హుస్సేన్‌బాషా, నాగిరెడ్డి రాజేష్‌రెడ్డి మస్తాన్‌బాషా, షకీలా, అహ్మద్‌బాషా, సంజయ్‌కుమర్ తదితరులు పాల్గొన్నారు.

● జనసేన ఆధ్వర్యంలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జనసేన నాయకులు నివాళులర్పించారు. జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ అంబేడ్కర్ అందించిన జ్ఞానాన్ని స్ఫూర్తిగా ముందుకు నడిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, కార్యాలయం ఇన్‌చార్జి జమీర్, గుర్రం కిషోర్, హేమచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

● జిల్లా కోర్టు ప్రాంగణంలో...

నెల్లూరు(లీగల్) : జిల్లా కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పులిమి అయ్యప్పరెడ్డి, జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నక్కల నాగరాజు, న్యాయవాదులు ఓ.అబ్బాయి రెడ్డి, పీ.విజయకుమార్‌రెడ్డి, బద్దెపూడి రవీంద్ర, ఎన్.వెంకయ్య, సంపూర్ణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేత బాలసుధాకర్


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

జగన్ వ్యాఖ్యలకు నిరసనగా బీసీ సంఘాల ఆందోళన


ఆందోళన చేస్తున్న బీసీ సంక్షేమ సంఘాల నాయకులు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీ అధికారులపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ నగరంలోని మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద వివిధ బీసీ సంఘాల నాయకులు శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పలమాల శ్రీహరిరావు ఆధ్వర్యంలో నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ ఐఏఎస్‌లపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనకకు తీసుకోవాలన్నారు. ఐఏఎస్‌లు కృష్ణయ్య, జెట్టి గోపినాథ్‌లను వాడు, వీడు అని జగన్‌మోహన్‌రెడ్డి సంబోధించడం వలన బీసీల మనోభావాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే తీవ్రంగా పరిగణిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు షేక్ సలీం, మన్నెం రామగౌడ్, తరుణ్‌సింగ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు బొమ్మి సురేంద్ర ఆధ్వర్యంలో నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, బీసీల పట్ల మాజీ సీఎం అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. జగన్ వెంటనే బీసీలందరికీ క్షమాపణ చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో వడ్డెర, శాలివాహన, నాయీబ్రాహ్మణ, పల్లెకాపు, అగ్రికుల క్షత్రియ, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటం దహనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హిందూ దేవుళ్లను అనుమానించేలా అహంకారపూరితంగా మాట్లాడటాన్ని బీజేపీ నాయకులు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం నగరంలోని కోటమిట్టలో ఉన్న మహాలక్ష్మి ఆలయం వద్ద తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని బీజేపీ నాయకులు దహనం చేశారు. ఇలాంటి వ్యాఖ్యలు తగవన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్, నాయకులు హేమంత్, పెంచలయ్య, ఖాజా మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.





రోడ్డు ధ్వంసం... ప్రయాణం నరకం!

అనంతసాగరం డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు - సోమశిల ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పీడీపల్లి, మంచాలపల్లి, కమ్మవారిపల్లి, పడమటికంభంపాడు, సోమశిల గ్రామాల వద్ద రహదారి నరకప్రాయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షానికి ద్విచక్రవాహనాలు వెళ్లలేని పరిస్థితి. సోమశిల రోడ్డు బాగా లేక ఉప్పలపాడు వరకు మాత్రమే ఆర్టీసీ సర్వీసులు నడిపారు. ఇక సోమశిల - కలువాయి రోడ్డు కూడా ఇదే పరిస్థితి. జలాశయం వద్ద గుంతలు పడి అధ్వానంగా మారింది. మొత్తంగా సోమశిల ప్రయాణమంటే ప్రజలు భయంతో వణికిపోతున్నారు.

నెల్లూరు నుంచి కలువాయిని వేరుచేయవద్దు..!

కలువాయి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కలువాయిని నెల్లూరు జిల్లా నుంచి విడదీవద్దని శనివారం అంబేడ్కర్ విగ్రహానికి ఏడీపీఎస్ నాయకులు వినతిపత్రం అందచేశారు. అంబేడ్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఏడీపీఎస్ ఆధ్వర్యంలో బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలువాయిని, గూడూరు డివిజన్‌ను తిరుపతి జిల్లాలోకి మార్పు చేస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా వారు నిరసన తెలిపారు. సేవ్ కలువాయి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏడీపీఎస్ రాష్ట్ర నాయకులు నిజమాల ప్రసాద్ మాట్లాడుతూ కలువాయిని తిరుపతి జిల్లాలో కలిపితే పేద ప్రజలు ఇబ్బంది పడుతారని అన్నారు. స్థానిక ప్రజల ఆకాంక్షలను ప్రభుత్వం గుర్తించి నెల్లూరులోనే ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమానికి స్థానిక యువకులు మద్దతు తెలిపారు. కాగా మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపొద్దంటూ శనివారం రాత్రి కలువాయిలో కొవొత్తులు ర్యాలీ నిర్వహించి, నిరసన తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు, యువత కలసి పడమర వీధి కొవొత్తులు పట్టుకుని ర్యాలీగా బస్టాండుకు చేరుకున్నారు. బస్టాండులో నిరసన వ్యక్తం చేశారు.





నిఘా నేత్రం వేలాడుతోంది!

సంగం (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో మెయిన్ బజార్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా వేలాడుతూ నేల చూపు చూస్తోంది. గత మూడు రోజులుగా ఇలా వేలాడుతోందని, పోలీసులు స్పందించి వెంటనే సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

త్యాగమూర్తులు..మన సైనికులు

- వెలకట్టలేనివి వారి సేవలు
- ఎందరో అమరులు..వారి స్మృతికి చిహ్నమేదీ..?
- నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : దేశం యావత్తు నిద్రలో ఉండగా...సరిహద్దుల్లో గడ్డకట్టే చలిలోనూ.... ఎడారి మధ్యలో మండే వేడిని తట్టుకుని... కుటుంబానికి దూరంగా ఉంటూ గస్తీ కాచే యోధులు మన సైనికులు. వారిని స్మరించుకుంటూ, వారి సంక్షేమాన్ని కోరుతూ డిసెంబరు 7న (నేడు) సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం.

● కార్గిల్ పోరాట స్ఫూర్తి

నాదేశ భూభాగంలో ఒక్క ఇంచ్ కూడా తాకనివ్వను అనేంత తెగువ. శత్రుదేశ సైనికులను సరిహద్దులు దాటించేవరకు పోరాడిన ధైర్యం. భరతమాత కోసం ప్రాణాలైనా అర్పించేటంతటి త్యాగం... నాడు సైనికుల వీరోచిత పోరాట ఫలితంగా కార్గిల్ యుద్ధంలో చారిత్రక విజయం. అత్యంత క్లిష్ట సమయంలో పాకిస్తాన్ సైనికులను ఆక్రమిత భారత భూభాగం నుంచి తరిమికొట్టిన రోజిది. ఎప్పటికీ గుర్తిండి పోతుంది. ఇలాంటి ఎన్నో విజయాలను మనం స్ఫూర్తిగా తీసుకుంటున్నాం. కుటుంబాన్ని రక్షించేది పోలీసు అయితే.. దేశాన్ని రక్షించేది మాత్రం సైనికులే. సైనికులు సరిహద్దుల్లో నిలబడటం వల్లే మనం స్వేచ్ఛగా జీవిస్తున్నాం.ఈ క్రమంలో సైనికుల సంక్షేమం కోసమే సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.

● సైనికుల సంక్షేమం కోసం...

దేశాన్ని కాపాడుతూ ప్రాణాలు అర్పించిన వీర సైనికుల కుటుంబాలు, యుద్ధాల్లో గాయపడిన, అర్హతలు కోల్పోయిన సైనికులు, పింఛన్‌పై జీవనం సాగిస్తున్న మాజీ సైనికుల కోసం నిధులు సేకరించటం లాంటి సంక్షేమ కార్యక్రమాలను సాయుధ దళాల పతాక దినోత్సవం నాడు చేస్తుంటాం. ఈనెల 7న (నేడు) కలెక్టర్ హిమాన్షు శుక్లా మాజీ సైనికులకు విరాళాన్ని అందచేయనున్నారు. ఈనెల 8 నుంచి జిల్లా సైనిక సంక్షేమాధికారి హరికృష్ణ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ విస్తృతంగా సాగనుంది. కాగా పతాక దినోత్సవ కారు ఫ్లాగ్‌లను, స్టిక్కర్లను కలెక్టర్ ఇప్పటికే ఆవిష్కరించారు.



● 3వేల మంది మాజీ సైనికులు

జిల్లాలో 3వేల మంది వరకు మాజీ సైనికులు ఉన్నారు. వారిలో 67 మందికి 280 ఎకరాల భూములను కేటాయించారు. మాజీ సైనికులు ఎక్కువగా నెల్లూరు రూరల్, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఉన్నారు. 2023-24లో మెప్మా పొదుపు మహిళలు సైనిక సంక్షేమానికి రూ.18 లక్షల విరాళాన్ని అందచేశారు. 2024-25లో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయానికి రూ. 8 లక్షల విరాళాలు అందాయి.

● అమరజవానుల స్థూపం ఏదీ...?

జిల్లాలోని ఎందరో సైనికులుగా పనిచేసి అమరులయ్యారు. వారికి స్మృతికి చిహ్నంగా అమర్ జవానుల స్థూపం నెల్లూరులో ఏర్పాటు చేయలేదు. నగరంలోని ప్రధాన కూడలిలో ఆ స్థూపాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● స్పర్శ కేంద్రం ఏర్పాటు

జిల్లాలో మాజీ సైనికులకు పెన్షన్లు, వారి కుటుంబ సభ్యులకు పెన్షన్లు అందేలా చూడటానికి జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో స్పర్శ కేంద్రాన్నిఏర్పాటు చేశారు. ఇందులో వారి సమస్యలు పరిష్కరించుకోవచ్చు. మాజీ సైనికులకు గుర్తింపు కార్డులు కూడా ఇచ్చే ఏర్పాట్లు చేశారు.

సంక్షేమానికి అన్నీ చర్యలు తీసుకున్నాం



జిల్లాలో మాజీ సైనికుల సంక్షేమానికి అన్నీ చర్యలు తీసుకున్నాం. వారికి భూములు వచ్చేలా చూశాం. ఆక్రమణకు గురైన వారి స్థలాలను, తిరిగి వారికి వచ్చేలా అధికారులతో మాట్లాడుతున్నాం. పదవీ విరమణ పొందిన తరువాత నేరుగా తమ కార్యాలయంలో సంప్రదిస్తే పింఛన్ వచ్చేలా తక్షణ చర్యలు తీసుకుంటాం.

- హరికృష్ణ, జిల్లా సైనిక సంక్షేమాధికారి

అవసరాల మేరకే యూరియా

● పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు ● కలెక్టర్

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):రైతుల అవసరాల మేరకు యూరియా పంపిణీ చేయాలని కలెక్టర్ హిమాన్షుశుక్ల వ్యవసాయశాఖ అధికారులకు ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి శనివారం ఆయన డీఏవో సత్యవాణితో కలిసి వ్యవసాయశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాలు, పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు అవసరమైన యూ రియాను అందిస్తున్నామన్నారు. పంపిణీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బహిరంగ మార్కెట్లలో యూరియా నిల్వచేయడం, అధిక ధరలకు విక్రయించినట్లు గుర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. విజిలెన్స్, ఇంటలిజెన్స్ అధికారులు నిరంతరం నిఘా ఉంచాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు సకాలంలో అందించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ హిమవంశీ, మార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్, ఇంటలిజెన్స్ సీఐ నరసింహారావు, సివిల్ సప్లైస్ అధికారులు లీలారాణి, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పక్కనే డీఏవో సత్యవాణి

హోంగార్డుల సంక్షేమానికి చర్యలు

● ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ● అట్టహాసంగా హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో శనివారం 63వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో హోంగార్డులు అంతర్భాగమన్నారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తూ నీతి, నిజాయితీ, అంకితభావంతో పని చేస్తూ హోంగార్డు యూనిట్‌కు, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా అనారోగ్యంతో మరణించిన సురేష్ సతీమణికి హోంగార్డు ఉద్యోగానికి సంబధించిన నియామక పత్రం అందజేశారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన 26 మందికి ప్రశంసపత్రాలు అందజేశారు. అనంతరం హోంగార్డులు కాన్ఫరెన్స్ హాలు నుంచి కేవీఆర్ పెట్రోలు బంకు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న హోమ్ గార్డులు

గర్భిణులకు వరం.. పీఎం మాతృవందనం !!

● పథకం కింద ఆర్థిక భరోసా కల్పన ● పౌష్టికాహారం కూడా పంపిణీ

ఆత్మకూరు, డిసెంబరు 6 : ప్రధానమంత్రి మాతృవందన యోజన పథకం గర్భిణులకు ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అర్హులైన గర్భిణులు తమ వివరాలను స్థానిక అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదు చేసుకుంటే ఈ పథకం అందుతుంది. దీని ద్వారా మొదటి ప్రసవానికి రూ. 5000, రెండో ప్రసవానికి రూ.6000 అందిస్తారు. గర్భిణులకు విడతల వారీగా ఆర్థిక సాయం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ కోసం పౌష్టికాహారాన్ని సైతం పంపిణీ చేస్తారు. అదే క్రమంలో గర్భిణుల పర్యవేక్షణ బాధ్యతను అంగన్‌వాడీ కార్యకర్తలు తీసుకుంటారు. గర్భిణులకు పౌష్టికాహార లోపాన్ని నివారించేందుకు నిరంతరం పర్యవేక్షిస్తారు.

● నిబంధనలు ఇలా..

గర్భిణులకు 18 ఏళ్లు నిండితేనే మాతృవందన యోజన పథకం నుంచి ఆర్థిక సాయం పొందేందుకు అర్హులవుతారు. అర్హులు తమ బ్యాంకు ఖాతాకు ఆధార్, ఫోన్ నంబరు అనుసంధానం చేసుకోవాల్సి ఉంటుంది. రేషన్‌కార్డులో, పోషణ్ ఖాతాలో అర్హుల పేర్లు నమోదై ఉండాలి.

● మొదటి కాన్పు గర్భిణిగా నమోదైతే ఐదు నెలలోపు వారికి రూ.2 వేలు, అన్నీ రకాల టీకాలు వేసుకుంటూ సరైన పరీక్షలు చేయించుకుంటే 9 నెలల్లోపు రెండో విడతగా రూ. 2 వేలు, ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవమైతే రూ.1000 ఇస్తారు.

● రెండో కాన్పులో ఆడబిడ్డ జన్మిస్తే మూడున్నర నెలల తరువాత రూ. 6000 బాలింత ఖాతాలో జమ చేస్తారు.

అంగన్‌వాడీలకు బాధ్యతలు

పీఎం మాతృవందన యోజన లబ్ధిదారుల ఎంపికను గతంలో వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించేది. తాజాగా ఆ బాధ్యతలను అంగన్‌వాడీలకు ప్రభుత్వం అప్పగించింది. ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజక్టు పరిధిలో ప్రస్తుతం 237 మంది మొదటి కాన్పు గర్భిణులు ఉన్నట్లు గుర్తించి, నివేదిక అందించాం. రెండో కాన్పుకు 19 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించాం.

- పీ. సునీలత, సీడీపీవో, ఆత్మకూరు



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీవో సునీలత, అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

డీకేడబ్ల్యూ కళాశాలలో పీజీ అడ్మిషన్లు

నెల్లూరు(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : డీకేడబ్ల్యూ మహిళా డిగ్రీ కళాశాలలో పీజీసెట్ అర్హత లేకపోయినా సోమవారం నుంచి అడ్మిషన్ల జరుగుతాయని ప్రిన్సిపాల్ డీ.గిరి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ సెట్ అర్హత సాధించకపోయినా, సెట్ రాయకపోయినా ఎమ్మెస్సీ జువాలజీ, ఎంఏ తెలుగు పీజీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లకు అవకాశం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కోటాలో చేరే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం వర్తించదని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

వైద్యం అందక వివాహిత మృతి



గిరిజమ్మ (ఫైల్)

మనుబోలు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వరదల కారణంగా ఓ వివాహితకు వైద్యం అందక మృతిచెందిన సంఘటన మండలంలోని కొలనుకుదురులో గురువారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల కథనం మేరకు.. మండలంలోని తీర ప్రాంత గ్రామమైన కొలనుకుదురు అరుంధతి వాడకు చెందిన పిగిలాపు గిరిజమ్మ వ్యవసాయ కూలీ. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. గురువారం రాత్రి పది గంటల సమయంలో ఛాతీలో నొప్పి వచ్చింది. దీంతో 108కు ఫోన్ చేశారు. రోడ్డు మార్గంలో నీళ్ళు ఉన్నందున గ్రామం వరకు రాలేమని, పేషెంట్‌ను మనుబోలు పొలాలు ఉన్న రోడ్డు వరకు తీసుకురావాలని 108 సిబ్బంది చెప్పారు. దీంతో ఆటోలో గిరిజమ్మను తీసుకుని వెంకన్నపాళెం వరకు వచ్చారు. అక్కడ నుంచి ఆటో అవతలికి వెళ్ళలేకపోవడంతో గ్రామస్తుల సహకారంతో ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి అందులో గిరిజమ్మను తీసుకెళ్ళారు. అందుకు రెండు, మూడు గంటల సమయం పట్టింది. 108 దగ్గరుకు పేషెంట్ వెళ్ళగా సిబ్బంది ప్రాథమిక పరీక్షలు చేశారు. తీసుకురావడం ఆలస్యం కావడంతో గిరిజమ్మ అప్పటికే చనిపోయినట్లు సిబ్బంది నిర్ధారించారు. దీంతో కుటుంబసభ్యులు విలపించారు.

పురిటి గడ్డ రుణం తీర్చుకుంటా!

పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

నెల్లూరు(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సిటీ నియోజకవర్గంలో కార్యకర్తలకు అండగా ఉండి పురిటి గడ్డ రుణం తీర్చుకుంటానని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో మంత్రి కుమార్తె షరిణీతో కలిసి వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు, కార్యకర్తల సంక్షేమనిధి కింద 303 మంది టీడీపీ కార్యకర్తలకు రూ.76 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ కార్యకర్తల సంక్షేమానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. వారి సంక్షేమానికి ప్రతి ఏడాది రూ.10 కోట్లు కేటయిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు రూ.3.60 కోట్ల చెక్కులను కార్యకర్తలకు అందించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.25వేల వంతున అందించినట్లు చెప్పారు. ప్రజలను, తనను భుజాలపై మోసే కార్యకర్తలకు ఎంతో రుణపడి ఉంటానన్నారు. మంత్రి కుమార్తె షరిణీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు మంత్రి నారాయణ అన్ని హామీలు నెరవేర్చుతున్నారన్నారు. నగరాన్ని మెట్రోపాలిటిన్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు రాకముందే కార్యకర్తల సంక్షేమానికి రూ.10 కోట్ల కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీసెల్ ఉపాధ్యక్షుడు ధర్మవరపు సుబ్బారావు, రాష్ట్ర వేర్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కప్పిర శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ రూపుకుమార్ యాదవ్, తాళ్లపాక అనూరాధ, విజేతరెడ్డి, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, డివిజన్ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు



కార్యకర్తలకు చెక్కు అందజేస్తున్న మంత్రి నారాయణ కుమార్తె షరిణీ

వీఎస్‌యూ అథ్లెటిక్స్ క్రీడా పోటీలు ప్రారంభం

కావలి (టౌన్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ క్రీడా పోటీలు జేబీ డిగ్రీ కళాశాలలోని డాక్టర్ డీఆర్ క్రీడాప్రాంగణంలో శనివారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షతన జరిగిన ప్రారంభోత్సవ సభకు ముఖ్య అతిథిగా వీఎస్‌యూ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ వెంకట్రాయులు పాల్గొన్నారు. ముందుగా ఆయన క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గెలుపోటములతో సంబంధం లేకుండా పట్టుదల, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలన్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ అథ్లెటిక్స్ పోటీలు మహిళలు, పురుషుల విభాగాల్లో జరుగుతున్నాయని, వర్సిటీ పరిధిలోని 20 కళాశాలల నుంచి దాదాపు 150మంది క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఆదివారం పోటీలు ముగుస్తాయన్నారు.

● మహిళా చాంపియన్‌గా జేబీ క్రీడాకారిణి అపర్ణ

మహిళల వ్యక్తిగత విభాగంలో జేబీకి చెందిన అపర్ణ 5 ఈవెంట్లలో ప్రతిభ కనబరిచి వీఎస్‌యూ మహిళా చాంపియన్‌గా నిలిచారు. మహిళల విభాగంలో అబ్జర్వర్‌గా అమ్మాజీ, పురుషులు విభాగంలో అబ్జర్వర్‌గా ప్రవీణ్ వ్యవహరించారు. కార్యక్రమంలో వివిధ డిగ్రీ కళాశాలల పీడీలు, జేబీ అధ్యాపకులు పాల్గొన్నారు.



విజేతలను మెడల్స్‌తో అభినందిస్తున్న డాక్టర్ వెంకట్రాయులు, సుబ్రహ్మణ్యం నాయుడు

స్థానిక సమరానికి సన్నద్ధం కావాలి

● పశు సంవర్ధక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లీలావతి

ముత్తుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్నికల సమరానికి సన్నద్ధం కావాలని పశుసంవర్ధక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గుండాల లీలావతి పిలుపునిచ్చారు. ముత్తుకూరు టీడీపీ కార్యాలయంలో శనివారం మండల అధ్యక్షులు నీలం మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి చేర్చే బాధ్యతను కార్యకర్తలు తీసుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల సమరానికి ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలన్నారు. ఏకగ్రీవంగా స్థానిక ఎన్నికల్లో విజయభేరీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల బూత్ ఇన్‌చార్జ్‌లు ఇప్పటి నుంచి తమ పరిధిలో మెజారిటీ తెచ్చేందుకు కష్టపడాలన్నారు. సీఎం చంద్రబాబు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం కోసం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల దృష్టికి తేవడంతో పాటు ప్రతిపక్ష వైసీపీ అరాచక అకృత్యాలను ఎండగట్టాలన్నారు. అనంతరం క్లస్టర్ ఇన్‌చార్జ్‌లతో సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు రాగాల శివకృష్ణ, నాయకులు పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, పల్లికొండ శీనయ్య, శ్రీధర్‌రెడ్డి, నర్సారెడ్డి, ముత్యంగౌడ్, శ్రీనివాసులు, జనార్ధన్, నాగార్జున, సిద్ధు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర డైరెక్టర్ లీలావతి

పూరి జగన్నాథుడు సాక్షాత్తు విష్ణు స్వరూపం

చాగంటి కోటేశ్వరరావు

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శ్రీపూరి జగన్నాథస్వామి సాక్షాత్తు విష్ణుస్వరూపమని, శ్రీ శంకరాచార్యస్వామి మనకు అందించిన గొప్ప అష్టకం శ్రీజగన్నాథఅష్టకమని ప్రవచన చక్రవర్తి చాగంటి కోటేశ్వరరావు అన్నారు. శనివారం నగరంలోని టౌన్ హాల్లో శ్రీ భరద్వాజ రుద్రాభిషేక సంఘం ఆధ్వర్యంలో ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ ప్రస్తుతం మనం పూరి క్షేత్రంగా వ్యవహరిస్తున్న క్షేత్రం పేరు పురుషోత్తముని పురి అని పేర్కొన్నారు. తూర్పున పూరిక్షేత్రంలో జగన్నాథుడిగా, పశ్చిమాన ద్వారక క్షేతంలో శ్రీకృష్ణుడిగా, ఉత్తరాన బదరికా క్షేత్రంలో బదరీనారాయణుడిగా, దక్షిణాన శ్రీరంగంలో శ్రీరంగనాథుడిగా దేశం నాలుగు దిక్కులా విస్తరించి ఉన్నాడన్నారు.

సంగం బ్యారేజీ రహదారిపై భారీ గుంత



సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సంగం ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం వద్ద బ్యారేజికి వెళ్లే రహదారిలో భారీ గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. బ్యారేజి నిర్మించిన ఏజెన్సీ పాత కనిగిరి ప్రధాన కాలువ వంతెన నుంచి బ్యారేజి వరకు సిమెంట్ రహదారి నిర్మించాలి. కానీ బ్యారేజి నుండి ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయం వరకు నిర్మించి వదిలేశారు. కాగా, సిమెంట్ రోడ్డు నిలిపేసిన చోట వాహనాలు దిగేందుకు అనువుగా గ్రావెల్ వేశారు. వర్షాలకు గ్రావెల్ దెబ్బతిని ఒకవైపు గుంత ఏర్పడింది. దీంతో బ్యారేజి వైపు నుంచి వేగంగా వచ్చే వాహనాలు గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతేకాకుండా ఎదురెదురుగా వచ్చే వాహనాలు గుంతను తప్పించబోయి ఒకదానికొకటి ఢీకొంటున్నాయి. ఏజెన్సీ నిర్వాహకులు వెంటనే స్పందించి భారీ గుంతను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

ఉదయగిరిలో వీపీఆర్ నేత్ర వైద్యశిబిరం

ఉదయగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో శనివారం ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీపీఆర్ నేత్ర బస్సు శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు 300 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 218 మందికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, వీపీఆర్ ఫౌండేషన్ ఆర్గనైజర్ శంకర్ పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12288
వెండి కిలో ధర	రూ. 183600
వెండి ఒక గ్రాము	రూ. 188.60

ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



యూనిట్ మార్చ్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో పావని

ఆత్మకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శనివారం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా ప్రభుత్వ వైద్యశాల వద్ద యూనిట్ మార్చ్‌ను ఆర్డీవో బి పావని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఆకుల మహేంద్రరెడ్డి, సెట్నల్ సీఈవో శ్రీనివాసులు, సీఐ జి గంగాధర్, గ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఈడీ వాగాల శ్రీహరి పాల్గొన్నారు.

నాసిరకం ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు

మర్రిపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాసిరకం ఎరువులు విక్రయిస్తున్న దళారులపై కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి ఎస్.కవిత హెచ్చరించారు. ఇటీవల మర్రిపాడు మండలంలో అక్రమంగా నాణ్యతలేని నాసిరకం ఎరువులు ఇతర ప్రాంతాల నుండి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి కొందరు రైతులు తీసుకొచ్చారన్నారు. అనుమతి లేని ఎరువులను ఇకపై మండలంలో విక్రయిస్తున్నట్లు తమకు తెలిస్తే అట్టివారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారిని కవిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయం

ఉదయగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం అని ప్రధానోపాధ్యాయుడు జే మాధవరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని బిజ్జంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా విద్యార్థులకు స్టడీ అవర్స్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటూ నూరు శాతం ఫలితాల సాధనకు కృషి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాయబ్, సీఆర్ఎంటీ సిద్దయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మ్యాపింగ్ పక్కాగా నిర్వహించాలి

దుత్తలూరు (ఉదయగిరి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఎల్‌వోలు ఇంటింటా తిరిగి పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్లను గుర్తించి పక్కాగా ఆన్‌లైన్‌లో మ్యాపింగ్ చేపట్టాలని తహసీల్దారు యనమల నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక కార్యాలయంలో బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు చోట్ల ఓటు ఉంటే గుర్తించి ఒకటి తొలగించాలన్నారు. 2002 ఓటర్ల జాబితాతో 2025 ఓటర్ల జాబితా సరిచూసి ఎక్కడా పొరపాట్లకు తావులేకుండా మ్యాపింగ్ చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం జగన్ క్షమాపణలు చెప్పాలి

● యాపా నేతల డిమాండ్

ఆత్మకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ కులాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను కించపరుస్తు మాట్లాడిన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని యాదవ ఎంప్లాయిస్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (యాపా) రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పెరుమాళ్ల కొండయ్య తదితరులు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీ కుటుంబం నుంచి వచ్చి ఐఏఎస్ అధికారిగా సేవలందించిన పి కృష్ణయ్య, యువ ఐ పీఎస్ అధికారి జెట్టి గోపినాధ్‌ను మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి వాడు, వీడు అని అవమానకరంగా సంబోధించి మాట్లాడడం బాధాకరమని, దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా ఆయన వారిపై చేసిన వాఖ్యలను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాల్సిని డిమాండ్ చేశారు.

అధిక మోతాదులో యూరియా వాడొద్దు!

సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో రైతులు అధిక మోతాదుతో యూరియా వినియోగాన్ని అరికట్టేందుకు గ్రామ ప్రధాన చైర్‌పర్సన్ (సర్పంచ్) ఆధ్వర్యంలో ధరిత్రి మాత బచావో నిగ్రాని సమితిని శనివారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సమితి సభ్యులందరు కలిసి గ్రామంలో రైతులు అధిక మోతాదులో యూరియా వాడకాన్ని నివారించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి సెక్రటరి ఉదయ్‌కుమార్, వీపీఏ సుజాత, సభ్యులు క్రిష్టయ్య, నవీన్‌కుమార్, క్రిష్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించాలి : ఎస్ఐ

ఉదయగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ సమీపాన నెల్లూరు వెళ్లే మార్గంలో రోడ్డు పక్కనే ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని శనివారం కొందరు ఆక్రమించి హద్దులు ఏర్పాటు చేశారు. సమాచారం అందుకున్న ఆర్ అండ్ బీ అధికారులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించి ఆక్రమణదారులను హెచ్చరించారు. స్థలం ఆక్రమించేందుకు ఏర్పాటు చేసిన వాటిని తొలగించాలని సూచించారు. వైఎస్ఆర్ సర్కిల్ వద్ద చర్చికి అనుకుని ఆర్ అండ్ బీ స్థలం ఉంది. ఆ స్థలంలో కొందరు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. దానిని చూసిన కొందరు స్థలం తమదనిపించుకునేందుకు రోడ్డుపక్కన లారీలు, కార్లు, ఆటోలు ఏర్పాటు చేశారు. మరికొందరు మట్టి తోలి చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. స్థలం ఆక్రమణకు గురవుతున్నట్లు ఆర్ అండ్ బీ అధికారులకు సమాచారం అందడంతో వారు పోలీసులను ఆశ్రయించారు. ఆక్రమణలన్నీ తొలగించాలని, లేదంటే చర్యలు తప్పవని ఎస్ఐ వారికి సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుడి తండ్రికి ఆర్థిక సాయం అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళగిరి కాలనీకి చెందిన మైదుకూరు శ్రీనివాసులు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో సమాచారం తెలుసుకున్న మన ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. వైద్యశాలలో పెట్టిన ఖర్చుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేస్తే ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు చర్యలు చేపడతామని కుటుంబ సభ్యులకు హామీ ఇచ్చారు. అలాగే దుత్తలూరులో మదర్ థెరిస్సా అనాధ శరణాలయం నిర్వహిస్తున్న కంపరాజు విజయమ్మకు నూతన భవన నిర్మాణానికి తక్షణసాయం కింద రూ.10 వేలు అందజేశారు. త్వరలో మరో రూ.40 వేలు భవన నిర్మాణ సామాగ్రికి అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మట్ల రామయ్య, లక్ష్మయ్య, గాజుల బాబు, అంకయ్య, నారాయణరెడ్డి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో మూలుగుతున్న స్మార్ట్ రైస్‌కార్డులు

●లబ్ధిదారుల వలసలతో పంపిణీకి నోచుకోని వైనం ● అధికారుల వద్ద పేరుకుపోయిన వేల కార్డులు

ఉదయగిరి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పౌర సరఫరా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో పాత రేషన్‌కార్డుల స్థానంలో స్మార్ట్‌కార్డులు అందజేసింది. దీనిని పెద్దఎత్తున ప్రారంభించగా, మెట్టప్రాంతంలో అధికభాగం కార్డులు అధికారుల వద్దే మూలుగుతున్నాయి. క్యూఆర్ కోడ్, డిజిటల్ వెరిఫికేషన్ సౌకర్యాలతో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడైనా రేషన్ తీసుకునేలా రూపొందించారు. దీనివల్ల పారదర్శకత, పోర్టబులిటీ లక్ష్యాలను చేరుకునే అవకాశముంది. అనేక మండలాల్లో అధికంగా కార్డులు పంపిణీ చేసినా వలసలు, ఈకేవైసీ సమస్యలు, చిరునామా మార్పులు, కార్డుల్లో తప్పులు సమస్యగా మారాయి. దీంతో వేల సంఖ్యలో స్మార్ట్‌కార్డులు సంబంధిత చౌక దుకాణాలు, సచివాలయాలలో పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.


దాసరిపల్లిలో స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేస్తున్న అధికారులు, టీడీపీ నాయకులు(ఫైల్)

లబ్ధిదారుల వలసలే కారణం

కార్డులు అందజేయకపోవడానికి ప్రధాన కారణం వలసలే అని తెలుస్తోంది. మెట్ట ప్రాంతంలో నిరుపేదలు అధికం. వీరంతా బెంగళూరు, చెన్నై, హైదరాబాదు, విజయవాడ, పూణే, గోవా తదితర నగరాలకు వలసపోవడం వల్ల వారికి అందించే వీలు చిక్కలేదని అధికారులు తెలుపుతున్నారు. దీంతోపాటు బయోమెట్రిక్, ఈకేవైసీ లోపాలు సరిచేసేవరకు కార్డు యాక్టివేషన్ ఆలస్యమవ్వడంతో అనుకున్న లక్ష్యాలు చేరుకోలేకపోయారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,17,202 స్మార్ట్ రైస్‌కార్డులు పంపిణీ చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,06,998 కార్డులు పంపిణీ చేశారు. ఇంకా అధికారుల వద్ద 10,204 పెండింగ్‌లో ఉన్నాయి. వీరంతా స్థానికంగా ఉన్నారా.. మరణించిన కార్డుదారులు ఎవరైనా ఉన్నారా.. లేక శాశ్వతంగా వలస వెళ్లారా.. అనే స్పష్టత లేకుండా ఉంది. కార్డులన్నింటినీ పంపిణీ చేయాలంటే ప్రత్యేకడ్రైవ్ ఏర్పాటుచేస్తే సమస్య పరిష్కారమవుతుంది. లేకుంటే ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతుంది. వలస వాసులు త్వరితగతిన కార్డులు తీసుకోవాలని, లేదంటే రద్దయ్యే అవకాశముందని అధికారులు తెలుపుతున్నారు.

సోషల్ ఆడిట్‌పై గ్రామసభ



సోషల్ ఆడిట్‌పై గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న డీఆర్పీ

సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగారెడ్డిపాళెంలో 2024-25 ఆర్థిక సంవత్సంలో ఉపాధి హామి పథకంలో జరిగిన పనులపై డీఆర్పీ సభ్యులు నిర్వహించిన సోషల్ ఆడిట్‌పై శనివారం సర్పంచ్ ఆనం ప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జరిగిన 76 పనులకు గాను సుమారు రూ. 17 లక్షలు కూలీలకు ఖర్చు చేసినట్లు తెలిపారు. సోషల్ ఆడిట్‌ను గ్రామ సభ ఆమోదించింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ వీఎస్ ఉదయ్‌కుమార్, వీపీఏ సుజాత, డీఆర్పీ సభ్యులు పెంచల ప్రసాద్, ఈసీ రవికుమార్, టీఏ కృష్ణారావు, ఎఫ్ఏ నరేష్, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను చిన్నచూపు చూడొద్దు


బహుమతులు అందిస్తున్న ఎంఈవో కొండయ్య

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి భవిత కేంద్రంలో శనివారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవోలు కొండయ్య, రమణయ్య మాట్లాడుతూ దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా అన్ని రంగాల్లో వారిని పోత్సాహించాలన్నారు. అనంతరం పలు అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, సూర్యనారాయణ, ఉపాధ్యాయులు వీ మోహన్, సీహెచ్ అన్వేష్, మనోహర్, చంద్రమౌళి, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీ బలోపేతానికి ప్రణాళికలు


దువ్వూరులో స్థానిక నాయకులతో చర్చిస్తున్న పరిశీలకులు, మండల నాయకులు

సంగం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీని గ్రామీణ ప్రాంతాల్లో మరింత బలోపేతం చేసేందుకు రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండలానికి వచ్చిన పరిశీలకులు పీఎల్ రావు పలు గ్రామాల్లో పర్యటించారు. అందులో భాగంగా మండలంలోని తరుణవాయి, వంగల్లు, పడమటిపాళెం, గాంధీజనసంఘం, దువ్వూరు గ్రామాల్లో పర్యటించి స్థానిక నాయకులతో చర్చించారు. 2029 ఎన్నికల్లో మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి పార్టీ తీసుకోవాల్సిన చర్యలపై ప్రణాళికలు తయారుచేశారు. ఈమేరకు నివేదికలను జిల్లా పార్టీ ద్వారా రాష్ట్ర పార్టీకి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు షేక్ బాబు, ముత్యాల విజయచంద్ర, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అనుకూలంగా బస్సు నడపాలి


డిపో మేనేజరుకు వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అనుకూలంగా ఆర్టీసీ బస్సు సర్వీసును నడపాలని పెద్దిరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు గ్రామస్థులతో కలిసి శనివారం ఉదయగిరి డిపో మేనేజరుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాతువారిపల్లితో పాటు ఉదయగిరి మండలం ఆర్లపడియ, పప్పులవారిపల్లి, కోటాయపల్లి గ్రామాల నుంచి 40మంది విద్యార్థులు పాఠశాలకు వస్తుంటారు. ఆయా గ్రామాల నుంచి ఉదయం 6గంటలకే బస్సు వస్తుండడంతో పరుగులు తీసిన విద్యార్థులు పాఠశాలలోనే కాలకృత్యాలు తీర్చుకోవాల్సి వస్తుందని వాపోయారు. సాయంత్రం తిరిగి గ్రామాలకు వెళ్లేసరికి 7 గంటలు అవుతుండడంతో తీవ్ర ఒత్తిడికి గురై చదువు, ఆరోగ్యంపై దృష్టి పెట్టలేకపోతున్నారన్నారు. అలాగే ధర్మవరం నుంచి వచ్చే విద్యార్థులకు సైతం బస్సు సౌకర్యం లేకపోవడంతో 30 మంది ఆటోల్లో ప్రమాదకర ప్రయాణం సాగించాల్సి వస్తోందని ఆయనకు విన్నవించారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బస్సు సర్వీసును ఏర్పాటు చేయడంతో పాటు సమయాన్ని మార్పు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రావిళ్ల నాగార్జున, చినరామయ్య, గ్రామస్థులు అడుసుమల్లి బయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి


విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షిస్తున్న టెక్నికల్ డైరెక్టర్ గురవయ్య

ఆత్మకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని రాష్ట్ర దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ (తిరుపతి) టెక్నికల్ డైరెక్టర్ కె గురువయ్య తెలిపారు. శనివారం ఆయన ఆత్మకూరు విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయాన్ని సందర్శించారు. డివిజనల్‌లో విద్యుత్ సబ్ స్టేషన్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్ పరిధిలోని విద్యుత్ కనెక్షన్లు, బకాయిల వివరాలను, ఉద్యోగుల పనితీరును అడిగి తెలుసుకున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది వారు పనిచేసే ప్రదేశాల్లో నివాసం ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు భానునాయక్, ఆత్మకూరు, ఉదయగిరి ఏడిఈలు చిన్నస్వామి నాయక్, సుధీర్, ఏఈలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతీఒక్కరూ నడవాలి


ఆత్మకూరు: అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెంచలయ్య


సంగం: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న జనసేన నాయకులు


ఉదయగిరి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. టీడీపీ, జనసేన, వైసీపీ, సీపీఎం, కాంగ్రెస్ తదితర పార్టీ నేతలు, కార్యకర్తలు ఆత్మకూరు పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కరటంపాడులో సర్పంచ్ పూనుగుంట రేవతి ఆధ్వర్యంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించి ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తూ అంబేడ్కర్ అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని సూచించారు.

●**సంగం:** మండలంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన సమాజ్‌వాది పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టి కృష్ణ, జనసేన పార్టీ సీనియర్ నాయకుడు దాడి భానుకిరణ్ ఆధ్వర్యంలో వేర్వేరుగా వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు వెంకటేశ్వర్లు, వెంకటసుబ్బయ్య, జనసేన నాయకులు చంద్ర, తిరుమలేష్, కృష్ణమోహన్, నిరంజన్, భాను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


అనంతసాగరం గ్రంథాలయంలో అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

●**అనంతసాగరం:** స్థానిక గ్రంథాలయంలో శనివారం బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంధపాలకుడు నారాయణరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ భవన్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు జామవా, బాలగురవయ్య, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జీ కృష్ణారెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, కృష్ణంపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సత్తార్, ఉపాధ్యాయులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

●**దుత్తలూరు:** స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తహసీల్దారు యనమల నాగరాజు, ఉద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అణగారిన వర్గాలకు అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు.

●**సీతారామపురం :** భారతరత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ వర్ధంతిని స్థానిక శ్రీశక్తి భవనంలో, బిట్-1 సచివాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్, డిపిఎం రత్నమ్మ, పంచాయతీ కార్యదర్శి పిడుగు రవీంద్ర ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిసిలు తమ్మిశెట్టి శ్రీనివాసులు, చెన్నకేశవులు, తిరుపాలు, మరియమ్మ, డిపి ఉమామహేశ్వరరావు, హసనయ్య పాల్గొన్నారు.


సీతారామపురం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెలుగు సిబ్బంది

గాడితప్పుతున్న పోలీస్

ప్రశాంత జిల్లాలో వరుస ఘటనలు

రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌తో చర్యలకు ఆదేశం

వరుసగా సస్పెన్షన్లు, వీఆర్‌కు పోలీసులు



నెల్లూరు(క్రైం) డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ప్రాణ, ఆస్తికి రక్షణగా నిలవాల్సిన పోలీసులే గాడితప్పుతున్నారు. అక్రమార్జనకు అలవాటుపడి విధులను గాలికి వదిలేస్తున్నారు. జిల్లాలో పోలీసు శాఖలో వరుసగా సస్పెన్షన్లు వీఆర్‌లు, బదిలీలు, చార్జ్ మెమోలు అందుకోవడం ఇందుకు నిదర్శనం. ప్రశాంతంగా ఉన్న నెల్లూరు జిల్లా గత కొన్ని సంవత్సరాలుగా నేరాలకు, ఘోరాలకు అడ్డాగా మారిపోయింది. పట్టపగలే హత్యలు జరుగుతుండటం పరిస్థితికి అద్దం పడుతోంది. వరుసగా జరుగుతున్న ఘటనలతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్ కావడంతో పోలీస్ ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు.

● **ఎన్ని కేసులో...**

రౌడీషీటర్ శ్రీకాంత్, లేడీ డాన్ అరుణలకు సహకరించిన ఏఆర్ ఏఎస్పీ మునిరాజ వీఆర్‌కు వెళ్లగా, నలుగురు ఏఆర్ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారు. గతంలో ఏఆర్ హోంగార్డు ఆర్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనారాయణ ఓ ఏఆర్ మహిళా కానిస్టేబుల్‌తో వివాహేతర సంబంధం పెట్టుకోవడంతో ఆ ఆర్ఐ భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు దిశా పోలీసులు కేసు నమోదు చేసి శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. అయితే విచారణలో నిజమని తేలడంతో ఆ ఇద్దరిని పోలీసు శాఖ నుంచి డిస్మిస్ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన జంటహత్యల పరిణామంలో ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావుతోపాటు ఎస్‌బీ హెడ్ కానిస్టేబుల్ మల్లిఖార్జునను సస్పెండ్ చేశారు. ఇక ఇటీవల విడవలూరుకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ పుల్లారెడ్డి నెల్లూరులోని ఓ హోటల్‌లో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఆయన్ను ఎస్పీ అజిత సస్పెండ్ చేశారు. ఈ అంశాలు పక్కన పెడితే గతంలో ఎప్పుడూ లేని విధంగా మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ చెంచురామారావుపై వచ్చిన అవినీతి ఆరోపణలపై డీజీపీ సస్పెండ్ చేశారు. ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. ఇక ఇటీవలే నెల్లూరు సీసీఎస్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ క్రమశిక్షణ రాహిత్యంగా వ్యవహరించిన నిరంజన్‌ను సస్పెండ్ చేశారు. అలాగే, నగరంలోని వేదాయపాలెం పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌ను సైతం 20 రోజులకుపైగా స్టేషన్‌కు రావద్దని ఎస్పీ ఆదేశించడం విశేషం. అదే స్టేషన్లో ఓ హెడ్‌కానిస్టేబుల్‌ను అవినీతి ఆరోపణల నేపథ్యంలో డీసీఆర్‌బీకి అటాచ్ చేశారు. ఆవెంటనే జిల్లా వ్యాప్తంగా పోలీసు స్టేషన్లలో ఉన్న ఐడీ పార్టీలు, క్రైమ్ పార్టీల వివరాల జాబితాను ఎస్పీ తీసుకోవడంతో మరింత మందిపై వేటు పడుతుందన్న ఆందోళన ఇటు అధికారులు, సిబ్బందిలోనూ నెలకొంది.

● **అధికారులకు చార్జ్ మెమోలు**

జిల్లా ఎస్పీగా డాక్టర్ అజిత వేజెండ్ల బాధ్యతలు చేపట్టిన తర్వాత నేర నియంత్రణలో విఫలమవుతున్న పోలీసు అధికారులకు వరుసగా చార్జ్ మెమోలు జారీ చేస్తున్నారు. నేరం జరిగిన వెంటనే నిందితులను అరెస్ట్ చేయలేక పోవడం, నేరం జరుగుతుందని ముందుగా ఎందుకు గుర్తించలేక పోయారు, అవినీతి ఆరోపణలు, ఇలా అనేక అంశాలపై పోలీసు అధికారులకు చార్జ్ మెమోలు వరుసగా అందిస్తున్నారు. ఈ క్రమంలో అధికారులు అప్రమత్తమవుతున్నారు.

గూడ్స్‌రైలు ఢీకొని వ్యక్తి మృతి


రైలు పట్టాలపై పడి ఉన్న వ్యక్తి మృతదేహం

కావలి రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గూడ్స్ రైలు ఢీ కొని ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందిన సంఘటన శని వారం కావలి రైల్వే స్టేషన్లో జరిగింది. లోకో పైలెట్ జీఆర్పీ పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే స్టేషన్లోని మూడవ లైన్ ట్రాక్ దాటుతుండగా విజయవాడ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొంది. మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు పరిశీలించారు. మృతుని వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. మృతుడు బులుగు రంగు చొక్కా, తెల్లని కట్ బనియన్, గోధుమరంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. కుడి చేతికి నల్లని పూసల తాడు, కుడికాలికి నల్లటి దారం కట్టుకున్నాడు. ఎడమచేతిపై షా అనే పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మృతుని వివరాలు తెలిసినవారు 9440627648 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఎస్ఐ తెలిపారు.

బురదలో కూరుకుపోయిన ఆర్టీసీ బస్సు

● తప్పిన ప్రమాదం

కలువాయి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ఆర్టీసీ బస్సు రోడ్డు దిగి చక్రాలు బురదలో కూరుకుపోవడం తో ఒక వైపునకు ఒరిగిన సంఘటన మండలంలోని ముక్కుతిప్ప వద్ద శనివారం చోటుచేసుకుంది. ఆ సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. అయితే ఎలాంటి ప్రమాదం లేకపోవడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.

పెంచలయ్య హత్య కేసులో మరొకరి అరెస్ట్

నెల్లూరురూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : కల్లూరిపల్లి వద్ద నవంబరు 27వ తేదీన పెంచలయ్యను హత్య చేసిన గంజాయి ముఠాలో మరో వ్యక్తిని శనివారం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనలో మొత్తం 18 మందికి సంబంధం ఉన్నట్లు పోలీసులు తేల్చారు. తాజాగా నగరంలోని కపాడిపాళెంకు చెందిన నిఖిల్‌ను అరెస్ట్ చేశారు. దీనితో ఇప్పటి వరకు 14 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మరో నలుగురిని అరెస్ట్ చేయాల్సి ఉందని సీఐ గుంజి వేణు తెలిపారు.

స్పా సెంటర్లపై పోలీసుల దాడులు

నెల్లూరు(క్రైం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నగరంలో స్పా సెంటర్ల ముసుగులో జరుగుతున్న అసాంఘీక కార్యకలాపాలపై సమాచారం అందుకున్న ఎస్పీ ప్రత్యేక బృందంతో పాటు ఆ పరిధిలోని పోలీసు స్టేషన్‌ల అధికారులు శనివారం రాత్రి దాడులు చేశారు. నగరంలోని నిప్పో సెంటర్ పుట్టవీధి పరిధిలోని ఎన్‌రీడే స్పా సెంటర్‌లో తనిఖీలు చేపట్టి పలువురు యువతులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని జగదీష్ నగర్‌లో యూనిక్స్ సెలూన్ స్పాపై దాడి చేసి ముగ్గురు యువతులు, ఒక విటుడిని అదుపులోకి తీసుకున్నారు. నిర్వాహకుడు సుధీర్‌పై కేసు నమోదు చేస్తున్నామని బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ సాంబశివరావు తెలిపారు. రామలింగాపురంలోని వీఐపీ స్పాపై దాడి చేసి ఇద్దరు యువతులను అదుపులోకి తీసుకొని నిర్వాహకురాలైన కృష్ణవేణిపై కేసు నమోదు చేశారు. పోలీసుల దాడులతో పలువురు స్పాల నిర్వాహకులు స్పా సెంటర్‌లకు తాళాలు వేసుకొని పరారయ్యారు. ఈ దాడుల్లో నగర ఇన్‌చార్జి డీఎస్పీ ఎం గిరిధర్ పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	150
స్కిన్ చికెన్	270
స్కిన్‌లెస్	294

కోడిగుడ్ల ధర (100): 670

ప్రాథమిక స్థాయిలోనే అభ్యసన సామర్థ్యాల పెంపునకు చర్యలు

కొండాపురం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ జీఎఫ్ఎల్ఎన్ రూపొందించిందని మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు శనివారం తెలిపారు. వారం నుంచి డైట్ కళాశాల విద్యార్థులు మండలంలోని అన్ని ప్రాథమిక పాఠశాలల్లో చిన్నారుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. వెను కంజలో ఉన్న పిల్లలను గుర్తించి ఈనెల 8 నుంచి 75 రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని విధిగా అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేసిందని ఆయన తెలిపారు.



పల్లెసీమల అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే ఇంటూరి

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పల్లెసీమల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని మేదరమెట్ల పాలెం గ్రామంలో రూ.32 లక్షలతో ఉపాధిహామి పథకం నిధులతో నిర్మించనున్న పంచాయతీ కార్యాలయం భవనానికి ఆయన స్థానిక సర్పంచు కూరపాటి మాధవితో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ నిధులన్నీ పక్కదారి పట్టించడంతో గ్రామాల పరిస్థితి దారుణంగా తయారైందని విమర్శించారు. ప్రభుత్వంలో 15వ ఆర్థిక సంఘం నిధులను నేరుగా పంచాయతీలకు జమ చేయడంతో గ్రామాల్లో సీసీ రోడ్లు, సైడు కాలువల నిర్మాణం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం మండలానికి తాగునీటి సరఫరా కోసం మరో రూ.2 కోట్ల చొప్పున నిధులు విడుదలయ్యాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగేశ్వరరావును సర్పంచు మాధవి, టీడీపీ నాయకులు కే శ్రీనివాసులు, గ్రామస్థులు, అధికారులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ డీఈ చంద్రమౌళి, ఏఈ శ్రీరామ్, ఇన్‌చార్జి ఏపీడీ జే బాబురావు, ఎంపీడీవో కే శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు పీ గురునాథం, టీడీపీ నాయకులు కే భాస్కరరావు, ఎస్ మనోహర్, గొర్రిపాటి సాంబయ్య, మాజీ సర్పంచు నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

● ఫిర్యాదులు వస్తే సహించేది లేదు

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదంలో భక్తుల నుండి ఫిర్యాదులు వస్తే సహించేదిలేదని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆలయ అధికారులను హెచ్చరించారు. మండలంలోని మాలకొండ శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామిని శనివారం ఆయన దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆలయ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అన్నదాన సత్రంలో అన్నం, లడ్డుకౌంటర్‌లో లడ్డుప్రసాదంను స్వయంగా రుచి చూసి భక్తులకు నాణ్యమైన ప్రసాదం అందించాలని సూచించారు. ఆయన వెంట ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు ప్రగడ శ్రీనివాసులు, కాకుమాను హర్ష, కామినేని అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రాత్రివేళ ఎరువుల తరలింపు : అడ్డుకున్న రైతులు

కలిగిరి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాత్రివేళలో సొసైటీ నుంచి అక్రమంగా ట్రాక్టర్లో తరలిస్తున్న ఎరువులను రైతులు అడ్డుకున్న ఘటన మండలంలోని కృష్ణారెడ్డిపాలెం వద్ద శుక్రవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కుడుములదిన్నెపాడు సొసైటీ నుంచి శుక్రవారం అర్ధరాత్రి ట్రాక్టరులో దాదాపు 60 బస్తాల యూరియా, డీఏపీలను తరలించడాన్ని స్థానిక రైతులు గుర్తించి కలిగిరి- కొండాపురం మార్గంలో అడ్డుకున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో సీజన్ మొదలై ఎరువుల కోసం ఎదురుచూస్తున్నామని, తమ పొలాలకు యూరియా కావాలని అడిగితే స్టాకు రాలేదని చెబుతూ ఇతర మండలాలకు ఎలా పంపుతారని సీఈవో ఖాజా మస్తాన్ తీరును తప్పుబట్టారు. అక్రమంగా ఎరువుల తరలింపు వ్యవహారం తేల్చేదాకా ట్రాక్టరును కదలనివ్వమంటూ పలువురు రైతులు అడ్డుకున్నారు. దాంతో సొసైటీ ఛైర్మన్ బాసిం నరసింహులునాయుడు ట్రాక్టరు అడ్డుకున్న రైతులకు సర్ది చెప్పడంతో వివాదం ముగిసింది.


శుక్రవారం రాత్రి ఎరువులు తరలిస్తూ పట్టుబడిన ట్రాక్టర్

ఈ విషయమై మండల వ్యవసాయాధికారి ఎస్కే జహీర్‌ను వివరణ కోరగా అక్రమ తరలింపు విషయం తన దృష్టికి రావడంతో కుడుమలదిన్నెపాడు పీఏసీఎస్‌ను కావలి, ఉదయగిరి సబ్ డివిజన్ కో-ఆపరేటివ్ అధికారులతో తనిఖీ నిర్వహించామని తెలిపారు. గతంలో మిగిలిన 48 యూరియా, 9 డీఏపీ బస్తాలు తన సొంత పొలాలకు తీసుకెళ్లినట్లు ఛైర్మన్ తెలిపారన్నారు. సొసైటీల పరిధిలో రసీదులు, రైతుల వివరాలను నమోదు చేయకుండా ఎరువులు తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

వాడవాడలా అంబేడ్కర్‌కి నివాళి


లింగసముద్రం పంచాయతీ కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు


ఉలవపాడు : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు


అల్లూరు : అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీద గిరిధర్, టీడీపీ నేతలు

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమ సమాజం కోసం కలలుకని అందుకోసం మార్గనిర్మించిన మహనీయుడు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ అని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం డాక్టరు బీఆర్ అంబేడ్కర్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, రాయపాటి శ్రీనివాసరావు, షేక్ రఫీ, గోచిపాతల మోషే, పులి నాగరాజు, రెబ్బవరపు మాల్యాద్రి, కోటపూరి శ్రీనివాసరావు, సుదర్శి శ్యాంప్రసాద్, చనమాల శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు. బీఆర్ అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా శనివారం పట్టణంలోని పాతబస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఏఏడీ అసోసియేషన్, మాలమహానాడు, మాల ఉద్యోగుల సంఘం డివిజన్ కమిటీల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పాలేటి కోటేశ్వరరావు, శీలం సుధీర్‌కుమార్, లింగాబత్తిన బ్రహ్మయ్య, బొట్లగుంట శ్రీనివాసులు, గేరా చిరంజీవి, చలమాల కోటేశ్వరరావు, కళ్యాణ్, ముప్పవరపు కిషోర్, రేణమాల అయ్యన్న, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచిలో అంబేడ్కర్ వర్థంతి కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం నిర్వహించారు. యూనియన్ నాయకులు దామా కొండయ్య, సూరపోగు ఏసుదాస్, శ్రీరామ మాలకొండయ్య, పాలేటి కోటేశ్వరరావు, బి. రాజేష్, దామోదర్, రామచంద్రరావు, కట్టా చరణ్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలోను అంబేడ్కర్ వర్థంతి కార్యక్రమాన్ని నిర్వహించి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **కావలి (టౌన్) :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ వర్థంతిని పురస్కరించుకుని శనివారం పట్టణంలో టీడీపీ, బీజేపీ నాయకులు ఘన నివాళులర్పించారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పట్టణ ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు అధ్యక్షతన అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ పి అలేఖ్య, నాయకులు మొగిలి కల్లయ్య, ముడికొండ సుకుమార్, పొట్లూరు శ్రీనివాసులు, తటవర్తి వాసు, ఏగూరు చంద్రశేఖర్, దేవకుమార్, వల్లేరు కిరణ్, అక్కిలగుంట సూరి, చవల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ముసునూరులో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో వైసీపీ పట్టణ అధ్యక్షుడు కేతిరెడ్డి శివకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నేతలు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కనమర్లపూడి నారాయణ, గంధం ప్రసన్న, గుడ్లూరు మాల్యాద్రి, పరసు మాల్యాద్రి, గయాజ్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నేతలు అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు జి భరత్‌కుమార్, కె బ్రహ్మానందం, బెల్లంకొండ మాల్యాద్రి, సీవీసీ సత్యం, కమల, పరుసు వెంకటేశ్వర్లు, సన్నిగంటి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగసముద్రం : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి స్పరంచు పులి రాఘవులు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పీ బాలకోటయ్య, ముస్లీం మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ షఫి, మాజీ సర్పంచు యూ నాగేశ్వరరావు, మద్దు బాలు, అత్తింటి ప్రసాదు, టీ వెంకటేశ్వరరెడ్డి, కే తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలోని పలు గ్రామాల్లోను, ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఉలవపాడులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గారపాటి గోపీచంద్ ప్రకాష్, అధ్యాపకులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా ఉలవపాడు, ఆత్మకూరు, వీరేపల్లి, చాగొల్లు, చాకిచర్ల, రామాయపట్నం, కరేడు, రాజుపాలెం, భీమవరం, బద్దిపూడి గ్రామాల్లో అంబేడ్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహాలకు పాలభిషేకం చేసి నివాళులు అర్పించారు.

అల్లూరు : అంబేడ్కర్ చూపిన స్ఫూర్తిబాటలోనే దేశమంతా నడుస్తోందని సోమశిల ప్రాజెక్టు కమిటీ ఉపాధ్యక్షుడు బీద గిరిధర్ అన్నారు. అంబేడ్కర్ వర్థంతి సందర్భంగా పట్టణ పరిధిలోని పాత బస్టాండు కూడలిలో ఆయన విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బండి శ్రీనివాసులురెడ్డి, తోట శ్రీహరి, కావలి జగన్, ఇస్మాయిల్, రాజశేఖర్‌బాబు, కత్తుల శ్రీకాంత్, అరగల రమణయ్య, కావలి కృష్ణ, శీనయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు. అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం 40 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు పప్పు సుధాకర్, గంగపట్నం సతీష్, కప్పల వంశీకృష్ణ, కమల్ తేజ, యశ్వంత్, రాము, జీవన్ పాల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిట్రగుంట : మండలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు శనివారం పలువురు నివాళులర్పించారు. బోగోలు తహసీల్దారు సానా శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి తమ కార్యాలయాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బోగోలు కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి న్యాయవాదులు ఇర్ల వెంకట రమణ, జొన్నాడ విజయ్ కుమార్, జి.ఏదిత్యకుమార్ తదితరులు నివాళులర్పించారు. టీడీపీ మండల కన్వీనర్ మాలెపాటి నాగేశ్వరరావు, కావలి ఏఎంసీ డైరెక్టర్ ఎల్.సుధీర్‌బాబు, గిరిజన నాయకుడు బోగిరి ప్రభాకర్, బి.పిలిప్ తదితరులు పూలమాలలు వేసి నివాలులర్పించారు. వైసీసీ మండల కన్వీనర్ వీరరఘు, మాజీ సర్పంచి అంకులయ్య, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మేకల శ్రీనివాసులు, ఎంపీటీసీ ఏకే సుందరరాజ్, రసూల్ తదితరులు నివాళులర్పించారు.

రాజీయే రాజమార్గం : సీనియర్ సివిల్ న్యాయాధికారి

కందుకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని, కేసులను ఎంత త్వరగా పరిష్కరించుకుంటే కక్షిదారులకు అంత త్వరగా ఉపశమనం లభిస్తుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి, మండల లీగల్‌సెల్ అథారిటీ ఛైర్మన్ ఎం. శోభ అన్నారు. శనివారం ఆమె డివిజన్‌లోని పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశమై ఈనెల 13వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషిచేయాలని కోరారు. అడిషనల్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ నిఖిల్‌రెడ్డి మాట్లాడుతూ సివిల్ దావాలతో పాటు ఇరుపార్టీలు రాజీపడితే క్రిమినల్ కేసులను కూడా ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునన్నారు. ఈ సమావేశంలో కందుకూరు, గుడ్లూరు సీఐలు అన్వర్‌బాషా, మంగారావు, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి శ్రీధర్‌నాయుడు, ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరి, న్యాయవాదులు టి తిరుమలరావు, బీవీ మురళీకృష్ణ, బి సాయిశంకర్, ఎస్. పవన్‌కుమార్, ఎస్కే షంషుద్దీన్, ఏవీ సుబ్బరామయ్య, వై. యలమందరావు, పి. సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కందుకూరు సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

మండలాభివృద్ధికి కృషి చేయాలి : జడ్పీటీసీ

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మండలాభివృధికి కృషి చేయాలని జడ్పీటీసీ సభ్యురాలు ఇంటూరి భారతి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పొనుగోటి మౌనిక అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశంలో జడ్పీటీసీ భారతి మాట్లాడుతూ సభ్యులు తెలిపిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేకాధికారి చెన్నకేశవులు, ఎంపీడీఓ శంకరరావు, పోలినేని పాలెం ఎంపీటీసీ చింతలపూడి రవీంద్ర, చుండి ఎంపీటీసీ చౌడబోయిన యానాది, సర్పంచ్‌లు ఇరపని సతీష్, చెన్నిబోయిన ఓబులుకొండయ్య, సాధు శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ భారతి

ఫిజియోథెరపీ సేవలకు ప్రాధాన్యం

కావలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఫిజియోథెరపీ సేవలకు ఎంతో ప్రాధాన్యత పెరుగుతోందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. కావలిలోని శ్రీలక్ష్మి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ తొలి స్నాతకోత్సవ కార్యక్రమం శనివారం కావలిలో జరిగింది. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డీవో ఎం. సన్నీ వంశీక్రిష్ణతో కలిసి ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. తొలిబ్యాచ్ ఫిజియోథెరపీ విద్యార్థులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా డిగ్రీ పట్టాలు అందజేశారు. తొలిబ్యాచ్ విద్యార్థులు క్లినికల్ శిక్షణలో మంచి నైపుణ్యం సంపాదించారని కరస్పాండెంట్ డాక్టర్ మాధవరెడ్డిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు బెజవాడ రవికుమార్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ

స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలి

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటిపన్నులు త్వరగా వసూలు చేయాలని సూచించారు. అలాగే సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు

ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి

లింగసముద్రం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు జవాబుదారీగా పని చేయాలని కందకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశించారు. శనివారం సాయంత్రం మండలంలోని మొగిలిచెర్ల సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది హాజరు పట్టీలను తనిఖీ చేశారు. సచివాలయానికి వచ్చిన అర్జీలను పరిశీలించారు. ప్రజలను తిప్పుకోకుండా వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. పెండింగ్ అర్జీలపై సిబ్బందితో చర్చించారు.

హోంగార్డులకు సన్మానం

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డ్స్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కందుకూరు సర్కిల్‌లో ఉత్తమ సేవలందించిన ఇద్దరు హోంగార్డులను జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల శనివారం సత్కరించారు. షేక్ నజీర్‌హుస్సేన్, ఎదురూరి చెన్నకేశవాచారిలను ఎస్పీ సత్కరించి మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా వారిని పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది, సహచర హోంగార్డులు అభినందించారు.


హోంగార్డుకు షీల్డు అందచేస్తున్న ఎస్పీ

నేడు కరేడులో జిల్లాస్థాయి జూడో ఎంపికలు

ఉలవపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో కరేడు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో ఆదివారం మధ్యాహ్నం జూడో పోటీల ఎంపికలు జరగనున్నట్లు ఆర్గనైజేషన్ కార్యదర్శి జీ మురళి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారు కర్నూల్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. వివరాల కోసం 8919036160 నెంబరుకు ఫోన్ చేయాలని పేర్కొన్నారు.

స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత పరీక్షలు

వెంకటాచలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని నారాయణ మెడికల్ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్ వారి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా స్వర్ణభారత్ విద్యా మందిర్ విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కేతఈసీ విద్యసాగర్, ల్యాబ్ టెక్నీషియన్ ఎం భాస్కర్ పాల్గొన్నారు.

ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం

ఇందుకూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తూరు జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ ప్రాజెక్టు అధికారి దగ్గినబోయిన వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరుజిల్లాలో 38 మంది మండలాల్లో 2 ఐఈఆర్‌టీలు, సీఆర్‌పీలు, సైకోథెరపిస్టులు ఉన్నారని ఇప్పటి వరకు సైకోథెరపిస్టు వారానికి ఒకరోజు వచ్చేవారని, ఇక వచ్చే నెల నుంచి వారానికి ఏడు రోజులు వస్తారని, ఆదివారం తప్ప మిగతా రోజులన్నీ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐఈ కో ఆర్డినేట్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ సంవత్సరం అన్నీ అలవెన్సులు వారి వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ చేయబడ్డాయని తెలిపారు.

మెప్మా ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కావలి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌నగర్, వెంగళరావునగర్‌లోని ఆరోగ్య కేంద్రాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్యశిబిరాల్లో మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వీటిని మున్సిపల్ కమిషనర్ జి.శ్రావన్‌కుమార్ ప్రారంభించారు. ఈ శిబిరాలను మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లీలారాణి సందర్శించి మహిళలతో మాట్లాడారు. అందరూ మంచి ఆరోగ్యం కలిగి ఉండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ఆరోగ్య సమస్యలున్న వారు నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం పొందేలా ఆయుష్మాన్ భారత్ కార్డులను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో మెప్మా హెల్త్ అండ్ న్యూట్రీషియన్ బి.కాంతయ్య, సీఎంఎం భారతి, సీవోల కొండయ్య, అరుణ, ప్రసన్న, ప్రతాప్, సునీత తదితరులు పాల్గొన్నారు.


కూచిపూడి నృత్యకళాకారులను అభినందిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్

● చిన్నారులకు కమిషనర్ అభినందన

కావలి (టౌన్) డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చిన్నారులు నృత్య ప్రతిభా పాటవాలతో ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేర్లు నమోదు చేసుకొని నృత్య శిఖామణి అవార్డులు సాధించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ అన్నారు.

పట్టణ క్రిష్టియన్ పేటలోని సంయుక్త నృత్య కళానిలయంలో శనివారం నాట్య గురువు గంగపట్నం లిఖిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని అవార్డులు సాధించిన చిన్నారులు జి ఖ్యాతి, ఎం సాయిశ్రీ, సుగాత్రిక, హాన్విక, రుత్విక, తనన్య, రిషిక, నిహాన్వి, ఉజ్వల, వైష్ణవి, మహితలను అభినందించారు. నాట్య గురువు లిఖితకు నాట్యాలంకార శిరోభూషణ్ అవార్డు లభించింది. కార్యక్రమంలో డాక్టర్లు వీవీ సుబ్బారావు, రవికాంత్, సంస్థ సభ్యులు అజిత్‌బాబు, ప్రసాదరావు, ఖాదర్‌బాష పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి పలువురికి గాయాలు

వలేటివారిపాలెం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కారు అదుపు తప్పి హైవే మార్జిన్ దిగడంతో పలువురికి గాయాలైన సంఘటన మండలంలోని కూనిపాలెం సమీపంలో జాతీయ రహదారిపై శనివారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. అరుణాచలం నుండి మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని కారులో తిరిగి అరుణాచలం వెళ్తుండగా కూనిపాలెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిలో రమేష్, వెంకటేశ్వర్లు, రాజ్యలక్ష్మీ, రాజేశ్వరితో పాటు తొమ్మిది నెలల పాప కూడా ఉంది. క్షతగాత్రులను వలేటివారిపాలెం 108లో సిబ్బంది పొట్టేళ్ల శ్రీకాంత్, రాజశేఖర్ కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.


గాయపడినవారిని ఆసుపత్రికి తరలిస్తున్న 108 సిబ్బంది

నేత్రదానం

కావలి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జెండా వీధికి చెందిన కేతు సూర్యనారాయణ(53) శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, సామాజిక కార్యకర్త శివంకరరెడ్డి చొరవతో కుమారుడు కేతు సతీష్‌కుమార్ అంగీకారంతో ఆయన నేత్రాలను నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి దానం చేశారు. ఆయన కార్నియాలను ఎల్‌వీ ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్య నిపుణుడు సునీల్ సేకరించారు. నేత్రదాత కుటుంబ సభ్యులకు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ నేత్రదాన విభాగం కన్వీనర్ ఇలింద్ర శ్రీవాణి మాట్లాడుతూ పట్టణంలో ఇది 154వ నేత్రదానమని తెలిపారు.

బాధితులకు అండగా రెడ్‌క్రాస్


బాధిత మహిళకు దుస్తులు, వంటసామగ్రిని అందజేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కావలి,డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): విపత్తులు, ప్రకృతి వైపరీత్యాల బాధితులకు రెడ్‌క్రాస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని కావలి రెడ్‌క్రాస్ విపత్తుల విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్ తెలిపారు. పట్టణంలోని బుడంగుంట దళితకాలనీ మాతమ్మగుడి వీధికి చెందిన కేశవరపు సుగుణమ్మ పూరిల్లు శుక్రవారం రాత్రి కాలిపోయింది. దాంతో శనివారం ఉదయం రెడ్‌క్రాస్ సభ్యులు ఆమెను పరామర్శించి తక్షణ సహాయంగా నూతన దుస్తులు, వంట పాత్రలు, టార్పాలిన్ పట్ట అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యుడు కలికి శ్రీహరిరెడ్డి, పట్టణ వైస్ ఛైర్మన్ కె.హరినారపరెడ్డి, పాలకమండలి సభ్యులు బెజవాడ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పిల్లలు చదువుతుండగా ఫొటో తీస్తున్న పర్యవేక్షకులు



పిల్లలకు భోజనం వడ్డిస్తున్న చిత్రాన్ని అప్‌లోడ్ చేస్తున్న హాస్టల్ పర్యవేక్షకులు

వసతిగృహాల నిర్వహణ ఇక పక్కాగా..

నిరంతర పర్యవేక్షణకు కొత్త యాప్

విద్యార్థులు నిద్రలేచింది మొదలు పడుకునే వరకు అన్ని వివరాల నమోదు

కేటగిరి	వసతి గృహాలు	విద్యార్థులు
బీసీ	59	4,544
ఎస్సీ	60	5,400
ఎస్టీ	23	4,650

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వసతిగృహాల నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పర్యవేక్షణ, పారిశుధ్యం, భోజనం, సౌకర్యాల లోపాలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి వాటికి తావులేకుండా నిత్య పర్యవేక్షణ కోసం కృత్రిమ మేథ ఆధారిత ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. హాస్టల్స్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) పేరుతో ఏఐ వ్యవస్థతో పనిచేసే ఈ యాప్ విద్యార్థులు నిద్రలేచినప్పటి నుంచి తిరిగి నిద్రకు ఉపక్రమించే వరకు ప్రతి అంశాన్నీ అందులో నమోదు చేయాల్సి ఉంటుంది. ప్లేట్లు కడగడం మొదలు పిల్లల హాజరు, భోజనాలు, వంట చేస్తున్న పరిసరాలు, ఆహార పదార్థాల నాణ్యత, పరిసరాలు, తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత తదితర అంశాలకు సంబంధించి ఫొటోలు తీసి యాప్‌లో నమోదు చేయాలి. జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాల్లో, వార్డెన్ల సెల్‌ఫోన్లలో ఈ యాప్‌ను ఇన్‌స్టాల్ చేశారు. వీటిని జిల్లా కేంద్రానికి అనుసంధానం చేశారు.

అన్ని వివరాలు ఉన్నతాధికారుల దృష్టికి..

ఈ యాప్ ద్వారా హాస్టళ్లకు సంబంధించిన అన్ని వివరాలు జిల్లా కేంద్రంలోని ఉన్నతాధికారుల దృష్టికి వెళతాయి. ఎంతమంది విద్యార్థులు హాజరయ్యారు.. వారికి ఎంత ఆహారం కావాలి.. ఆ మేరకు వండుతున్నారా.. అందులో వేయాల్సిన పదార్థాలు మోతాదు మేరకు వాడుతున్నారా.. వాటి నాణ్యత ఎలా ఉంది.. తిన్న ప్లేట్లను సరిగా శుభ్రం చేస్తున్నారా అనేది అధికారులు పరిశీలిస్తారు. ఎక్కడైనా తేడా ఉంటే వెంటనే వార్డెన్‌కు ఫోన్ చేసి మందలిస్తారు. సౌకర్యాల కొరతపైనా దృష్టి సారించి, సరిదిద్దే అవకాశం ఉంటుంది.

వార్డెన్లకు అవగాహన కల్పించాం

వసతిగృహాల నిర్వహణ పారదర్శకంగా ఉండేందుకు హెచ్‌పీటీఎస్ యాప్ ఉపయోగపడుతుంది. దీని వినియోగంపై వార్డెన్లకు ఇప్పటికే అవగాహన కల్పించాం.

- విక్రమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి



పెట్రోల్ బంకు వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న అర్బన్ సీఐ బాబి

హెల్మెట్ ఉంటేనే పెట్రోల్

సూళ్లూరుపేట/నాయుడుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ఉంటేనే పెట్రోల్ పట్టాలని పోలీసులు సూళ్లూరుపేట పెట్రోల్ బంకుల యజమానులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం పోలీసుస్టేషన్‌లో పెట్రోల్ బంకుల యజమానులతో సీఐ మురళీకృష్ణ, ఎస్‌ఐ బ్రహ్మానాయుడు సమావేశమయ్యారు. ఈనెల 15వ తేదీ నుంచి 'నో హెల్మెట్... నో పెట్రోల్' అమలు చేయాలన్నారు. దీనికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. వాహనదారులు సహకరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. కాగా, శనివారం సాయంత్రం నాయుడుపేటలోని అన్ని పెట్రోల్ బంకుల వద్ద అర్బన్ సీఐ బాబి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

భారీగా ఎస్‌ఐల బదిలీలు

- 10 మందికి స్థానచలనం
- 30 మంది పీఎస్‌ఐలకు పోస్టింగ్

తిరుపతి(నేరవిభాగం),డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 10 మంది ఎస్‌ఐలను బదిలీ చేశారు. అలాగే ఐదు నెలల క్రితం శిక్షణ కోసం వివిధ స్టేషన్లలో ప్రొబేషనరీ ఎస్‌ఐలుగా నియమితులైన మరో 30 మందికి పోస్టింగ్‌లు ఇస్తూ ఎస్పీ సుబ్బరాయుడు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

బదిలీ అయిన రెగ్యులర్ ఎస్‌ఐలు..

బి.రాఘవేంద్రను భాకరాపేట నుంచి పిచ్చాటూరుకు, టి.వెంకటసుధాకర్ గాజులమండ్యం నుంచి ఎస్పీ తిరుపతికి, ధర్మారెడ్డి వడమాలపేట నుంచి ఎస్పీ తిరుపతికి, సి.వెంకటేష్ పిచ్చాటూరు నుంచి శ్రీకాళహస్తి రూరల్‌కు, షేక్ షావలీ తిరుపతి రూరల్ నుంచి డీసీఆర్‌బీ, తిరుపతికి, తలారి ఓబయ్య తిరుపతి వీఆర్ నుంచి డీసీఆర్‌బీ తిరుపతికి, శివాజీ మహిళా పీఎస్ నుంచి డీసీఆర్‌బీ తిరుపతికి, ప్రియాంక ఎస్పీ తిరుపతి నుంచి శ్రీసిటీకి, రమేష్‌బాబు తిరుమల వన్‌టౌన్ నుంచి ఎస్పీ తిరుపతికి, సీ చలపతి తిరుమల వన్‌టౌన్ నుంచి ఎస్పీ తిరుపతికి బదిలీ అయ్యారు.

30 మంది పీఎస్‌ఐలకు పోస్టింగ్‌లు

జిల్లాలో ఐదు నెలలుగా వివిధ పోలీస్ స్టేషన్లలో ప్రొబేషనరీ ఎస్‌ఐలుగా పనిచేస్తున్న 30 మందికి పోస్టింగ్‌లు కేటాయించారు. సూరే నాగరాజు అలిపిరి నుంచి గాజులమండ్యంకు, సుబ్బారెడ్డి తిరుపతి ఈస్ట్ నుంచి ఎస్వీయూకు, దుర్గాప్రసాద్ ఎస్వీయూ నుంచి అలిపిరికి, ఎస్వీ సుబ్బారెడ్డి తిరుపతి వెస్ట్ నుంచి శ్రీకాళహస్తి వన్‌టౌన్‌కు, వడ్డే అశోక్ తిరుచానూరు నుంచి పుత్తూరుకు వెళ్లారు. అలాగే శ్రీరాములు తిరుపతి రూరల్‌కు, తరుణ్ చంద్రగిరి నుంచి శ్రీసిటీకి, బండి హరీష్ పాకాల నుంచి వడమాలపేటకు, లోకేష్ ఎర్రావారిపాళ్యెం, అరవ సిద్ధారెడ్డి భాకరాపేట నుంచి తిరుచానూరుకు, హుస్సేన్‌బాబా ఏర్పేడు నుంచి తిరుపతి ఈస్ట్‌కు, సుధీర్‌కుమార్ రెడ్డి బీఎన్ కండ్రిగ నుంచి శ్రీసిటీకి, కురుబ జ్యోతి తిరుపతి ఈస్ట్ నుంచి తిరుపతి రూరల్‌కు, స్వాతి తిరుచానూరు నుంచి అలిపిరికి, రాజాపవన్ కుమార్ నారాయణవనం నుంచి భాకరాపేటకు, సూరే హరీషా తిరుపతి రూరల్ నుంచి వెస్ట్‌కు, శ్రీనివాసులు పిచ్చాటూరు నుంచి నారాయణవనానికి, బుడ్డా స్వాతి రేణిగుంట నుంచి తిరుపతి ఈస్ట్‌కు, ప్రవల్లిక గాజులమండ్యం నుంచి చంద్రగిరికి, వెంకటరమణ శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి తొట్టంబేడుకు, వెంకటలక్ష్మి ఏర్పేడు నుంచి పుత్తూరుకు, ఇమ్మాన్యూయల్ కేవీబీపురం నుంచి శ్రీకాళహస్తి రూరల్‌కు, శ్రీకాంత్ సత్యవేడు నుంచి రేణిగుంటకు, శ్రీవాణి శ్రీకాళహస్తి వన్‌టౌన్ నుంచి అలిపిరికి, హైసీ పుత్తూరు నుంచి ఎస్వీయూకు, హరిత శ్రీకాళహస్తి టూటౌన్ నుంచి రేణిగుంటకు, ప్రసాద్ నాగలాపురం నుంచి తిరుపతి ఈస్ట్‌కు, అరుణాచలం శ్రీకాళహస్తి రూరల్ నుంచి చంద్రగిరికి, ఎర్రని జ్యోతి తొట్టంబేడు నుంచి శ్రీకాళహస్తి టూటౌన్‌కు, బి.లావణ్య వడమాలపేట నుంచి సత్యవేడు అడిషనల్ ఎస్‌ఐగా నియమించారు.



సమస్యల ఏకరువు

- సభ్యుల చర్చతోనే ముగిసిన జడ్పీ సమావేశం
- మళ్లీ గైర్హాజరైన జిల్లాస్థాయి అధికారులపై చర్యలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో జిల్లాలో నెలకొన్న సమస్యలను సభ్యులు ఏకరువు పెట్టారు.అయితే సమావేశానికి కొన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు రాకపోవడంతో ఎలా చర్చించాలని సభ్యులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎవరెవరు సమావేశానికి హాజరు కాలేదో వారందరిపై చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ముందుగా జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు జడ్పీ పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వివరించారు.సమావేశానికి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎవరూ హాజరు కాలేదు.ఒక్క ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాత్రం హాజరయ్యారు.జిల్లాలో అధికంగా నమోదవుతున్న స్క్రబ్ టైఫస్ కేసుల నివారణకు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం, రామసముద్రం జడ్పీటీసీ రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాధి ఇంకా ప్రబలక ముందే అధికారులు నివారణ చర్యలు తీసుకోవాలని, ఎక్కడిక్కడే పరీక్షా కిట్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఈ వ్యాధి ఎలా వ్యాపిస్తుందనే విషయంపై ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు.సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో పిల్లలు తరచూ ఫుడ్ పాయిజన్ బారిన పడుతున్నారని , నెలకు రెండు సార్లు విధిగా వైద్యుల బృందం హాస్టళ్లను సందర్శించాలని కోరారు.జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ పడమటి మండలాల్లో రైతులకు యూరియా అందడం లేదని, గత రెండు సమావేశాల్లో దీన్ని ప్రస్తావించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీనిపై కలెక్టర్ కలగజేసుకొని వ్యవసాయ శాఖ వచ్చే మూడు నెలల్లో ఏం చేస్తుంది? యూరియా పంపిణీలో కిందిస్థాయి అధికారులకు ఏ విధమైన సూచనలు ఇచ్చారో సభలో వివరించాలని అధికారులకు సూచించారు.నారాయణవనం జడ్పీటీసీ సుమన్ మాట్లాడుతూ సొంత స్థలాలున్నవారు ఇంటి నిర్మాణానికి పొజిషన్ సర్టిఫికెట్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి పోతే రూ.25 వేలు డిమాండ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇంకా వేరుశనగ విత్తనాలు పంపిణీ చేయలేదనగా వారంలో అందజేస్తామని వ్యవసాయ అధికారులు చెప్పారు. ఎర్రావారిపాళ్యం,వడమాలపేట జడ్పీటీసీలు కరుణాకర రెడ్డి,మురళీరెడ్డి,బంగారుపాళ్యం ఎంపీపీ అమరావతి మాట్లాడుతూ జిల్లాలో గోకులం షెడ్లన్నీ అనర్హులకే కేటాయించారని ఆరోపించారు.స్పందించిన డ్వామా పీడీ అనర్హులకు షెడ్లు మంజూరు చేయలేదని చెప్పడంతో కొంత మంది సభ్యులు లేచి అనర్హులకు ఇవ్వలేదని తేలిస్తే రాజీనామా చేస్తామంటూ ఆవేశపడ్డారు.కలెక్టర్ కలగజేసుకొని ఎవరెవరు అర్హులున్నారో వివరాలు సేకరించి ఇస్తే పరిశీలించి షెడ్లు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.పెద్దమండ్యం ఎంపీపీ పూర్ణచంద్రిక మాట్లాడుతూ దళారుల కారణంగా టమోటా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మదనపల్లె, పలమనేరు, గుర్రంకొండ... ఇలా ఒక్కో ప్రాంతంలో ఒక్కో రేటు ఎందుకుందో అధికారులు చెప్పాలని నిలదీశారు.ఉపాధి పనుల మస్టర్లను పరిశీలించాలని అడిగితే కలెక్టర్ చూపవద్దన్నారని ఏపీవో చెప్పారంటూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గుడుపల్లె మండలం సోడిగంపల్లి జడ్పీ హైస్కూల్‌కు త్రీఫేజ్ కరెంటు లేక తాగునీటికి విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని జడ్పీటీసీ కృష్ణమూర్తి చెప్పగా స్పందించిన కలెక్టర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే గుడుపల్లె నుంచి ఇరిసిగానిపల్లి, వెంకటాపురం గ్రామాలకు వెళ్లేందుకు మార్గం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఒక్క వంతెన నిర్మిస్తే 10 గ్రామాల రాకపోకలకు ఇబ్బంది తీరుతుందని వివరించారు.డీఆర్వో నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బాంబులు పెట్టాం..ఎప్పుడైనా పేలొచ్చు

- హోటళ్ల యాజమాన్యాలకు మెయిల్స్
- తనిఖీలు చేసి ఉత్తిదే అని తేల్చిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): 'బాంబులు పెట్టాం.. అవి ఏ సమయంలోనైనా పేలొచ్చు..' అంటూ నగరంలోని రిపబ్లిక్ ఇన్, బ్లిస్ హోటల్స్ యాజమాన్యాలకు పాకిస్థాన్‌కు చెందిన ఐఎస్ఐ తీవ్రవాదుల పేరుతో శనివారం మధ్యాహ్నం మెయిల్ రావడం కలకలం రేపింది. బ్లిస్ హోటల్ మేనేజర్ కబీర్ ఆ మెయిల్‌ను ఈస్ట్ సీఐ శ్రీనివాసులుకు పంపారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో సీఐతో పాటు సిబ్బంది, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్ హోటళ్ల వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. వంట గదులు, రూములు, కారు పార్కింగ్ ప్రాంతాలు, రిసెప్షన్, బాల్కనీ, వీఐపీలు వేచి ఉన్న గదులు, డైనింగ్ రూములు, వాష్‌రూములు, ఇతర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానితులను తనిఖీ చేశారు. రెండు గంటలపాటు తనిఖీలు చేసిన అనంతరం అవి ఉత్తుత్తి బెదిరింపులేనని తేల్చారు. తిరుపతికి వరుసగా బాంబు బెదిరింపు కాల్స్ వస్తుండటంతో పోలీసులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. నగర ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

స్విమ్స్‌లో పీజీ కోర్సులకు స్పాట్ కౌన్సెలింగ్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో పీజీ కోర్సులకు సంబంధించి ఎంఎస్సీ బయోటెక్నాలజీ-2, బయోఇన్ఫర్మెటిక్స్ 2 సీట్లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీన్ అలోక్‌సచిన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 10న మధ్యాహ్నం 12 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు కౌన్సెలింగ్ నిర్వహించి, సీట్లు కేటాయిస్తామని వివరించారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

8 నుంచి ఎస్వీయూలో పీజీ స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో పీజీ (ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ) కోర్సుల్లో ప్రవేశానికి ఈనెల 8వ తేదీ నుంచి స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు ఈ ప్రక్రియ చేపడతారు. ఏపీ పీజీసెట్-2025 రాసిన వాళ్లూ, రాయని వాళ్లు, ఉత్తీర్ణత సాధించిన, సాధించని వారు కూడా ఇందులో ప్రవేశానికి అర్హులు. 8వ తేదీ కామర్స్, కంప్యూటర్ సైన్స్, 9న సైన్స్, 10వ తేదీ ఆర్ట్స్ విద్యార్థులు ఎస్వీయూలోని అడ్మిషన్స్ కార్యాలయానికి హాజరుకావాల్సి ఉంటుంది. సమగ్ర సమాచారం కోసం 0877-2248589లో సంప్రదించవచ్చునని ఎస్వీయూ రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు తెలిపారు.



క్రమశిక్షణతో సేవలందించండి

- నూతన ఎస్‌ఐలతో ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించాలని ఎస్పీ సుబ్బరాయుడు నూతన ఎస్‌ఐలకు సూచించారు.కొత్తగా నియమితులైన 30 మంది ఎస్‌ఐలతో పోలీసు అతిథిగృహంలో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు.విధి నిర్వహణలో ఎలా మెలగాలి.. ప్రజలతో ఎలా మమేకం కావాలి...ఫ్రెండ్లీ పోలీసింగ్ గురించి ఎస్పీ వివరించారు. సాంకేతిక నైపుణ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

ఎస్వీయూ పీజీ ఫస్ట్ సెమిస్టర్ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలోని పీజీ రెగ్యులర్, డిస్టెన్స్ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఈ ఫలితాలను పొందుపర్చినట్లు వర్సిటీ పరీక్షల డీన్ సురేంద్రబాబు, సీఈ డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు.

ఏపీ ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ (ఏపీఓఎస్ఎస్) డైరెక్టర్ ఆర్. నరసింహారావు శనివారం విడుదల చేశారు. 10వ తరగతి పరీక్షలు 2026 మార్చి 16 నుంచి 28వ తేదీ వరకు, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. ఇంటర్ పరీక్షలు 2026 మార్చి 2 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నాయి. విద్యార్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ఈ నెల 10వ తేదీలోగా పరీక్ష ఫీజు చెల్లించవచ్చు. సబ్జెక్టుకు రూ.25 అపరాధ రుసుంతో ఈ నెల 11, 12 తేదీల్లోగా, రూ.50తో ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు ఫీజు చెల్లించవచ్చు.

సంస్కృత వర్సిటీలో కీచక పర్వం

ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ సస్పెన్షన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకున్న కీచకపర్వమిది. ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌కుమార్ ఒడిశాకు చెందిన డిగ్రీ విద్యార్థినితో సంబంధం పెట్టుకుని గర్భవతిని చేయగా అదే విభాగానికి చెందిన మరో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎ. శేఖర్‌రెడ్డి వారి రాసలీలలను సెల్ ఫోన్‌లో చిత్రీకరించినట్టు సమాచారం.ఆ వీడియోలను చూపి శేఖర్‌రెడ్డి కూడా లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.బాధిత విద్యార్థిని యూనివర్సిటీ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో లక్ష్మణ్‌కుమార్‌ను సస్పెండ్ చేశారు. బాధిత విద్యార్థిని ఇటీవల టీసీ తీసుకొని ఒడిశాలోని సొంత ప్రాంతానికి వెళ్లి పోగా వర్సిటీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసే ప్రయత్నం చేశారు. అయితే ఫిర్యాదును బాధితురాలు ఇవ్వాలని పోలీసులు సూచించడంతో సస్పెన్షన్‌తో సరిపెట్టేశారు.ఈ విషయమై రిజిస్ట్రార్ వెంకట నారాయణరావును అడగ్గా బాధిత విద్యార్థిని ఫిర్యాదుతో ఈ ఘటనపై లోతుగా విచారణ చేపడుతున్నామని చెప్పారు.భవిష్యత్తులో ఇలాంటి ఘటనకు తావివ్వకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.సుదీర్ఘ చరిత్ర కల్గిన సంస్కృత విశ్వవిద్యాలయంలో చోటు చేసుకుంటున్న ఘటనలు తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి. కొంత కాలం క్రితం యూనివర్సిటీలో డ్రగ్స్ పట్టుబడగా ఇప్పుడు కీచకపర్వం బయటపడి విశ్వవిద్యాలయం ప్రతిష్ఠ మసకబారుతోంది.



ప్రొఫెసర్ లక్ష్మణరావు

ఎస్సెస్సీ నామినల్‌రోల్స్‌లో సవరణలకు అవకాశం

తిరుపతి(విద్య), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సెస్సీ - 2026 పబ్లిక్ పరీక్షలకు సంబంధించి యూడైస్, పోర్టల్‌లో నమోదుచేసిన నామినల్ రోల్స్‌లో తప్పులుంటే సవరణలు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్టు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. మార్పులు అవసరమైన విద్యార్థులు త్వరితగతిన పూర్తిచేసుకోవాలని సూచించారు. హెచ్ఎంలు వివరాలను పరిశీలించి సరిదిద్దాలని ఆదేశించారు. మరిన్ని వివరాలకు http://bse.ap.gov.in లింక్‌ద్వారా విద్యాశాఖ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అంబేడ్కర్ పోరాటం భావితరానికి ఆదర్శం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సమానత్వం, సామాజిక న్యాయం కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చేసిన పోరాటం భావితరాలకు ఆదర్శమని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం తిరుపతి ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి కలెక్టర్ నివాళులర్పించారు. అంబేడ్కర్ సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎస్పీ సుబ్బరాయుడు, ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువన్షి, కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, మాజీ మంత్రి పరసా రత్నం, జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికారి విక్రమ్‌కుమార్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారి, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి ఆర్టీసీ బస్టాండు కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తదితరులు



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 28వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా 177 మంది, రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 1,693, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 2,185 మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 2,196 మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 716, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 276, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 236, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 103 మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 20,171 అమ్ముడైనట్లు అధికారులు తెలిపారు.


టీటీడీ బర్డ్ ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

తిరుమల, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): టీటీడీ బర్డ్ ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందాయి. హైదరాబాద్‌కు చెందిన ఏబీఆర్ కేఫ్ అండ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబురావు , శశాంక్ ఈ విరాళాన్ని హైదరాబాద్‌లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు సభ్యుడు సదాశివరావు కూడా ఉన్నారు.

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 28 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.68 కోట్లు
శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 67,336
తలనీలాలు సమర్పించినవారు: 25,063



SUNDAY FOCUS


గూడూరు గడియారం సెంటర్

దుగరాజపట్నంతో ముడిపెట్టి అడ్డుకుంటారా?



తిరుపతి జిల్లాకు దుగరాజపట్నం పోర్టు ఉండాలనే గూడూరును తిరుపతిలో ఉంచుతున్నామని చెప్పడం సమంజసం కాదు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి అవకాశం లేదని 2018లోనే నీతి అయోగ్ తేల్చి చెప్పింది. రాష్ట్ర విభజన హామీ చట్టంలో ఈ అంశం పొందిపరిచినా ముందుకు సాగలేదు. ఇప్పుడు మళ్లీ దాంతో ముడిపెట్టి అడ్డుకోవడం అన్యాయం.

- వి.రాజేంద్రప్రసాద్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, గూడూరు


నెల్లూరు గాంధీ బొమ్మ సెంటర్

● రగులుకుంటున్న డిమాండ్

గూడూరు బంధం నెల్లూరుతోనే

గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో తిరిగి కలపకుండా అడ్డుకుంటున్న అంశాలేమిటి? అడ్డుకుంటున్న శక్తులు ఎవరు? ఏ కారణాలు ప్రజల బలమైన ఆకాంక్షను కూడా లెక్కచేయడం లేదు? అధికార కూటమికి రాజకీయంగా తీవ్ర నష్టం కలిగించే నిర్ణయమని తెలిసీ ఎందుకు అడుగు ముందుకే వేస్తున్నారు?.. ఇవీ ఇప్పుడు గూడూరు నియోజకవర్గంలోనే కాకుండా, నెల్లూరు జిల్లాలోనూ, తిరుపతి జిల్లాలోనూ ప్రజల్లో మెదులుతున్న ప్రశ్నలు. ఇందుకు సహేతుక కారణాలున్నాయని చెబుతున్న అంశాలను ప్రజలు అసలు నమ్మడం లేదు. రోజురోజుకూ ఈ డిమాండ్ బలం పుంజుకుంటూనే ఉంది. వినతులు, వేడుకోళ్ల దశ దాటి నిరసనల స్థాయికి చేరుకుంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి

నెల్లూరులో ఎందుకు?

నెల్లూరుకు ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. భాష, యాస, ఆహారపు అలవాట్లలో ఈ ప్రత్యేకత కనిపిస్తుంది. తిరుపతి ప్రాంతానికి వీటికీ ఎంతో కొంత తేడాలుంటాయి. పైగా గూడూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి నెల్లూరు జిల్లాలో కొనసాగుతూ వస్తోంది. బంధుబలగాలు, పెళ్లి సంబంధాలు, ఉపాధి పనులు, ఉద్యోగాలు, వ్యాపార సంబంధాలు, చదువులు, వైద్యం.. అన్నీ నెల్లూరుతోనే ముడిపడి ఉంటాయి. పైగా చేరువన ఉండే నెల్లూరును కాదని దూరంగా ఉండే తిరుపతితో అనుబంధం పెంచుకోవడం అంత సులువు కాదు.

లేని, రాని పోర్టు కోసమా?

తిరుపతి జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ చేసిన వ్యాఖ్యతో నిరాశ పెంచింది. తిరుపతి జిల్లాకు కుడా ఒక పోర్టు ఉంటే అభివృద్ధి సమతుల్యంగా ఉంటుందనేది ప్రభుత్వ భావనని, అందుకే వాకాడు మండలంలోని దుగరాజపట్నం కోసం తిరుపతిలోనే కొనసాగించాలని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్లు వివరించారు. దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణానికి 15 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. అప్పటి ఎంపీ చింతామోహన్ పట్టుదల వల్ల రాష్ట్ర విభజన చట్టంలోనూ పొందుపరిచింది. దీంతో 2014లో దుగరాజపట్నంతో పాటు తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, పామంజి, వాగర్రు, శ్రీనివాసపురం గ్రామాల్లో సుమారు 2,700 ఎకరాల భూములను గుర్తించారు. అయినా పోర్టు నిర్మాణానికి ముందడుగు పడలేదు. సాంకేతికంగానూ, ఆర్థికంగానూ దుగరాజపట్నంలో పోర్టు నిర్మాణం ప్రయోజనకరం కాదని అప్పట్లోనే నీతి అయోగ్ స్పష్టం చేసింది. దీంతో ఇది అటకెక్కింది. అప్పటి నుంచి నేటి వరకు కుడా కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతామోహన్ దుగరాజపట్నం పోర్టు కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడుతూనే ఉన్నా ఫలితం లేకుండా పోయింది. అయితే సీఎం చంద్రబాబునాయుడు ఈ ఏడాది మే నెలలో దుగరాజపట్నం వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.3,500 కోట్లతో నౌకానిర్మాణ కేంద్రాన్ని, ఓడల మరమ్మతుల యూనిట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించారు. అంటే పోర్టు స్థానంలో ఇవి ఏర్పాటు చేస్తారన్నమాట. మరి పోర్టు కోసమే తిరుపతి జిల్లాలో కొనసాగించాలన్న నిర్ణయంలో అర్థమేమిటనే ప్రశ్న ప్రజల నుంచి వస్తోంది.

వైసీపీ పాపం.. కూటమికి నష్టం

జగన్ ప్రభుత్వం నెల్లూరుతో పెనవేసుకున్న బంధాన్ని పుటుక్కున తెంచేసింది. తిరుపతి జిల్లాలో గూడూరు నియోజకవర్గాన్ని భాగం చేసింది. దీనిపై ఆ పార్టీ నాయకులెవరూ నోరు కూడా తెరవలేదు. ఈ నేపథ్యంలోనే ప్రజల ఆకాంక్షను గ్రహించి ఎన్నికలకు ముందు నారా లోకేశ్, చంద్రబాబు ఇద్దరూ గూడూరును తిరిగి నెల్లూరులోనే కలుపుతామని హామీ ఇచ్చారు. వీరి మాటలపై నమ్మకంతో ఉన్న ప్రజలు తాజా నిర్ణయంతో విస్తుపోయారు. గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించినా, అనంతరం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఈ అంశం లేదు. దీంతో ప్రజలు కోపంతో ఉన్నారు.

మీరిచ్చిన హామీలకే విలువ లేదా?



గత ప్రభుత్వం అశాస్త్రీయ పద్ధతిలో గూడూరును తిరుపతి జిల్లాలో కలిపింది. అప్పట్లో ప్రజలు వ్యతిరేకించినా పట్టించుకోలేదు. ప్రజలు ఓట్ల ద్వారా తమ తీర్పును ప్రకటించారు. ఇప్పటి ప్రభుత్వం కూడా అదే దారిలో వ్యవహరిస్తోంది. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. చంద్రబాబు, లోకేశ్ ఇచ్చిన హామీలకే విలువ లేకపోతే ఎలా? గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేంత వరకు, జేఏసీ ఆధ్వర్యంలో శాంతియుత పోరాటాలు సాగిస్తూనే ఉంటాం.

- బి.దశరథరామిరెడ్డి, జేఏసీ కన్వీనర్, గూడూరు

ఇంత కష్టపెట్టడం అవసరమా?



టీచర్లు శిక్షణా తరగతులు, కౌన్సెలింగ్, స్పాట్ వాల్యూయేషన్‌లకు జిల్లా కార్యాలయాలకు వెళ్లాల్సి ఉంటుంది. గూడూరు నుంచి నెల్లూరుకు 40 కిలోమీటర్లు. తిరుపతికి వెళ్లి రావాలంటే దూరం, కష్టం ఎక్కువ. ప్రజల కోరికను మన్నించి గూడూరును నెల్లూరులోనే ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- ఎస్.చిరంజీవి, ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గూడూరు.

మా బంధాలు తెంచేసుకోవాలా?



నాకు ఇద్దరు చెల్లెళ్లు. ఇద్దరికీ నెల్లూరు సంబంధాలే చేసుకున్నాం. నాకు ఇద్దరు కుమారులు. పెద్ద కోడలిది అప్పటి నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట. రెండో వాడికి ఇప్పటి నెల్లూరు జిల్లాలోనే సంబంధాలు చూస్తున్నాం. నెల్లూరుతోనే మా సంబంధబాంధవ్యాలన్నీ ఉంటాయి. మమ్మల్ని తీసకపొయ్యి తిరుపతిలో పెడితే ఎట్టా? ఇదేమి న్యాయం?

- జీ.రామచంద్రయ్య, వ్యాపారి, గూడూరు

మా గోడు ప్రభుత్వానికి పట్టదా?



నేను సీజన్ వ్యాపారిని. పదేళ్లుగా గూడూరు నుంచి నెల్లూరుకు రోజూ వెళ్తాను. నెల్లూరు హోల్‌సేల్ షాపుల నుంచి స్టీల్ సామాన్లు తెచ్చి గూడూరులోని దుకాణాలకు అందిస్తుంటాను. గూడూరులో పది స్టీల్ సామాన్లు విక్రయించే దుకాణాలు ఉన్నాయి. ఇదే నా ఉపాధి. నెల్లూరుకు చార్జీల ఖర్చు తక్కువ కాబట్టి వ్యాపారం సాగుతోంది. ఇదే తిరుపతితో చేయగలనా? నా మాదిరే రోజూ నెల్లూరు పొయ్యి వ్యాపారాలు చేసుకునేవాళ్లు గూడూరు ప్రాంతంలో ఎందరో ఉన్నారు. మా గోడు ప్రభుత్వం వినాలి.

- జే.సురేష్‌బాబు, సీజన్ వ్యాపారి, గూడూరు


దుగరాజపట్నం గ్రామం

దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ

● విభిన్న ప్రతిభావంతుల దినోత్సవంలో కలెక్టర్ వెంకటేశ్వర్


క్రీడల్లో ప్రతిభచూపిన దివ్యాంగులను సత్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఉన్న దివ్యాంగులకు ప్రత్యేక హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఇంటి వద్దకే పింఛను పంపిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నో పథకాలు అమలు చేస్తోందని, అందులో ఉచిత బస్సు ఒకటి అని అన్నారు. గృహ నిర్మాణాలకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అంతకు ముందు విభిన్న ప్రతిభావంతులను సన్మానించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన పురుషోత్తంరెడ్డి, కాంచన, దివ్య, విమల, శివ, కార్తీకలను అభినందించారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు నరసింహయాదవ్, రుద్రకోటి సదాశివం, పసుపులేటి హరిప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి విక్రమ్‌కుమార్ రెడ్డి, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు సుబ్రమణ్యం, మురళి, రామచంద్ర పాల్గొన్నారు.


విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆరేళ్ల క్రితం ఫిర్యాదు.. ఇప్పుడు స్పందన

● బాధ్యుల్లో ఇప్పటికే చాలామంది ఉద్యోగ విరమణ ● ఫిర్యాదుదారుడు మృతి
● ఎవరిపై చర్యలు తీసుకోవాలో అర్థంగాక తలలు పట్టుకుంటున్న అధికారులు

దక్కిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఆరేళ్ల క్రితం చేసిన ఫిర్యాదుకు అధికారులు ఇప్పుడు స్పందించి చర్యలకు ఆదేశించడం చర్చనీయాంశంగా మారింది. దక్కిలి మండలం పలుగోడు పంచాయతీ పరిధిలోని నాగులపాడు, తిమ్మాయపాళెం, పలుగోడు, హరిజనవాడలో 2018-19 ఆర్థిక సంవత్సరంలో రూ.30 లక్షలతో సిమెంటు రోడ్లు వేశారు. అయితే ఈ పనులు నాసిరకంగా జరిగాయంటూ పలుగోడుకు చెందిన రుషేంద్రరెడ్డి అప్పట్లోనే విజిలెన్సు అధికారులకు ఫిర్యాదు చేశారు. విజిలెన్సు విభాగం అప్పట్లో విచారణ జరిపి నివేదిక తయారు చేసింది గాని, అది వెలుగులోకి రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ నివేదికను బయటకు తీసి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమిస్తూ సంబంధిత శాఖలకు నోటీసులు జారీ చేసింది. అయితే ఆ సమయంలో పనులను పర్యవేక్షించిన అధికారులు చాలామంది ఇప్పటికే రిటైర్ అయ్యారు. ఎఫ్ఏసీ ఇన్‌చార్జి ఈఈగా పనిచేసిన రమణయ్య మాత్రమే ప్రస్తుతం నెల్లూరు పీఐయూలో డీఈగా ఉన్నారు. డీఈ, జేఈ వంటి ఇంజనీర్లు ఉద్యోగ విరమణ పొందారు. ఫిర్యాదుదారుడు రుషేంద్రరెడ్డి కూడా చనిపోయారు. దీంతో చర్యలు ఎవరిపై తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

హోంగార్డుల సేవలు అభినందనీయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హోంగార్డుల సేవలు అభినందనీయమని ఎస్పీ సుబ్బరాయుడు పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు పెరేడ్ గ్రౌండులో హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయడంలో హోంగార్డులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో పని చేయాలని కోరారు. ఆరోగ్య భద్రతను దృష్టిలో పెట్టుకుని పీఎం సురక్ష బీమా యోజన వంటి పథకాల్లో చేరాలని సూచించారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన హోంగార్డులకు ఉత్కృష్ట, అతి ఉత్కృష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, శ్రీనివాసులు, రామకృష్ణ, ఏవో రమేష్‌కుమార్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

కార్బన్ కంపెనీలో మొబైల్ ఫోన్ల చోరీ

ఏర్పేడు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయానికి సమీపంలో ఉన్న కార్బన్ మొబైల్ కంపెనీలో రెండు రోజుల క్రితం ఆ కంపెనీలో పనిచేస్తున్న నలుగురు కార్మికులు ఆరు మొబైల్‌ఫోన్లను చోరీ చేశారు. ప్యాకింగ్ సమయంలో చెక్ చేసుకున్న సిబ్బంది ఆరు మొబైళ్లు తక్కువ వచ్చాయి. ఈ క్రమంలో కంపెనీ అధికారులు పలువురు కార్మికులను విచారించారు. సీసీ ఫుటేజీని పరిశీలించారు. నలుగురు కార్మికులు మొబైల్ ఫోన్లను ఒక సెక్యూరిటీ గార్డు సాయంతో బయటకు తీసుకెళ్లినట్లు గుర్తించారు. శనివారం విధులకు వచ్చిన ఆ నలుగురు కార్మికులను కంపెనీ అధికారులు విచారించారు. తిరిగి అప్పగించాలని సూచించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మొబైల్‌ఫోన్ల చోరీ వాస్తవమేనని, విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

బీసీలంటే జగన్‌కు చిన్నచూపు

● ఆవు, లేగ దూడతో యాదవుల నిరసన

తిరుపతి, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): బీసీలంటే వైసీపీ అధినేత జగన్ రెడ్డికి లెక్క లేదని, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను నోటికొచ్చినట్టు మాట్లాడటం సరికాదని యాదవ సంఘ నాయకులు మండిపడ్డారు. సీనియర్ ఐపీఎస్ అధికారులైన కృష్ణయ్య, గోపీనాథ్ జెట్టిలను వాడూ, వీడూ అని జగన్ వ్యాఖ్యానించడంపై తిరుపతి యాదవ సమైక్య సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ఆవు, లేగ దూడలను పూజిస్తూ, ప్లకార్డులను చేతపట్టుకుని నిరసన తెలిపారు. వైసీపీ వైఖరితో బీసీలు చాలామంది ఆత్మహత్య చేసుకున్నారని మండిపడ్డారు. యాదవులకు జగన్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, యాదవ సంఘ నాయకులు కట్ట జయరాం, ఊతమూకల హేమంత్, కృష్ణ, అశోక్ సామ్రాట్, రామచంద్ర, పుష్పావతి, చిత్తూరు రవిశంకర్, మధుసూదన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఆవుదూడతో నిరసన తెలుపుతున్న యాదవ సంఘం నాయకులు

శెట్టిపల్లె టౌన్‌షిప్ పనులు మొదలుపెట్టండి

● తుడా అభివృద్ధికి ప్రాధాన్యత
● పాలకమండలి సమావేశంలో తీర్మానం



తిరుపతి, డిసెంబర్6(ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ (తుడా) పరిధిలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. తుడా కార్యాలయంలో శనివారం నిర్వహించిన తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ బోర్డు సమావేశంలో కలెక్టర్‌తో పాటు తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, వీసీ ఎన్.మౌర్య, ఎంఏయూడీ ఓఎస్డీ వెంకట సుబ్బయ్య, ఆర్డీ శ్రీనివాసులు పాల్గొని పలు అభివృద్ధి పనులపై చర్చించారు. శెట్టిపల్లి టౌన్‌షిప్ ఏర్పాటు చేయనున్న ప్రాంతం చదును, శుభ్రం చేసేందుకు టెండర్ పిలవాలని, పెరుమాళ్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ఏడు గ్రామాలకు గ్యాస్ ఆధారిత శ్మశాన వాటిక, కర్మక్రియల షెడ్డు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసేందుకు ఆమోదం తెలిపారు. ఉప్పరపల్లి నుంచి మహిళా విశ్వవిద్యాలయం వరకు నాలుగు లైన్ల రోడ్డుకు, మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలిపారు. రేణిగుంట మండలం సూరప్పకశం వద్ద తుడా పరిధిలో ఏర్పాటు చేసిన పద్మావతినగర్ లేఅవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్, సూపరింటెండెంట్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, సీపీఓ దేవికుమారి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలి

మంగళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నత అవకాశాలను చేజిక్కించుకోవచ్చని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ చెప్పారు. తిరుపతి రీజినల్ సైన్స్ సెంటర్లో శనివారం బాలల సైన్స్ ఫెస్టివల్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఫెయిర్ మోడల్స్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, క్రమశిక్షణను అలవరచుకోవాలని తెలిపారు. పురోగతికి దోహదం చేసే పరిశోధనలకు కృషి చేయాల్సిన అవసరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి టెంకాయల దామోదర్ అధ్యక్షత వహించగా రీజనల్ సైన్స్ సెంటర్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ నెహ్రూ, మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.


విద్యార్థులు చేసిన ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న ప్రొఫెసర్ సత్యనారాయణ

వరద నీటిలోనే వరిపైరు



అయ్యప్పరెడ్డిపాళెంలో వరదనీటిలోమునిగిపోయిన్న వరిపైరు

నాయుడుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో ఐదు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో నీట మునిగిన వరిపైరు ఇంకా తేరుకోలేదు. నాయుడుపేట మండలంలో రబీ సీజన్‌లో 12వేల ఎకరాల్లో వరి సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే 8వేల ఎకరాల్లో నాట్లు పూర్తి చేశారు. తుఫాన్ ప్రభావంతో దాదాపు 1000 ఎకరాలు నీటమునిగింది. వర్షం ఆగిపోయి రెండు రోజులు అవుతున్నా పొలాల్లో నీరు బయలకు పోకపోవడంతో పైరు దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలాల నుంచి నీరు పూర్తిగా బయటకు వెళ్లితే నష్టాలను అంచనాలు వేస్తామని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి సాయం అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉద్యోగావకాశాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు గూడూరు నియోజకవర్గంలో 9 సార్లు జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతకు పలు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 20లక్షల ఉద్యోగాలు ఇప్పించేలా కృషి చేస్తామని, మెగా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామని మంత్రి నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నారన్నారు. భవిష్యత్‌లో మన ప్రాంతంలో అనేక పరిశ్రమలు వస్తున్నాయని ఎంతో మంది ఉద్యోగ అవకశాలు కల్పించడం జరుగుతుందన్నారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, బల్లు చెంచురామయ్య, అబ్దుల్ రహీం, వాటంబేడు శివకుమార్, సోమిశెట్టి చెంచురామయ్య, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం, ప్రిన్సిపాల్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువునీటి వృథాను ఆపండి

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కోట మండలం వంజివాకలోని తిక్కచెరువు నీటిని బయటకు పంపేందుకు కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని, దీనివల్ల ఆయకట్టు భూములకు సాగునీరు అందక పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందని ఉచ్చూరువారిపాళెం రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తహసీల్దారు జయజయరావును కలిసి వినతి పత్రం అందజేశారు. తిక్కచెరువు కింద ఉచ్చూరువారిపాళెం రైతులకు 750 ఎకరాల భూములు ఉన్నాయన్నారు. ఇటీవల కురిసన వర్షంతో చెరువులోకి పుష్కలంగా నీరు చేరిందని, అయితే వంజివాక గ్రామానికి చెందిన కొంతమంది తిక్కచెరువుకు గండ్లుకొట్టి నీటిని బయటకు పంపే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల పంటల సాగుకు నీటి సమస్య ఉత్పన్నమవుతుందన్నారు. కాగా, నీటిని బయటకు వదలకపోతే చెరువు లోతట్టు భాగంలో ఉన్న పంటలు పూర్తిగా దెబ్బతింటాయని కొందరు రైతులు తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు.

నేడు అయ్యప్పస్వామి జ్యోతుల గ్రామోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో అయ్యప్ప స్వామి జ్యోతుల గ్రామోత్సవం ఆదివారం నిర్వహించేందుకు అయ్యప్ప భక్త బృందం ఏర్పాట్లు పూర్తి చేసింది. షార్ బస్టాండు వద్దనున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద జ్యోతి వెలిగించినుంచి అయ్యప్ప జ్యోతుల గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నారు.

దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలి



దివ్యాంగురాలికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎంలు భారతి, మాధవి

గూడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):దివ్యాంగ విద్యార్థులు మనోధైర్యంతో ముందుకు సాగితే విజయాలను సాధిస్తారని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలు భారతి, మాధవి అన్నారు. శనివారం స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోని భవిత కార్యాలయంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జ్యోతిర్మయి, అజయ్‌బాబు, మంగమ్మ పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని శాస్త్రవేతలుగా ఎదగాలని డీవైఈవో సనత్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక శ్రీచైతన్య పాఠశాలలో నాసా ప్రాజెక్టుకు ఎంపికైన విద్యార్థులకు నాసా కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, శ్రీకాంత్, శ్రీహరిబాబు, హరిబ్రహ్మ, చందన, మస్తానమ్మ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు, ముట్టెంబాక రేషన్ దుకాణాలను తహసీల్దారు ఇక్బాల్ సయ్యద్ శనివారం తనిఖీలు చేశారు. బియ్యం నిల్వలను పరిశీలించారు. కార్డుదారులకు రేషన్ సక్రమంగా అందించాలని సూచించారు. అవకతవకలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

సూళ్లూరుపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారు పోలూరులో 300 మంది వృద్ధులకు జనసేన నాయకులు దుప్పట్లు పంపిణీ చేశారు. మాబాషా, ఆవుల రమణ, నక్కా హరిబాబు, కోటేశ్వరరావు, కృష్ణారెడ్డి, రవి, ప్రవీణ్, మహిళా నాయకులు పద్మజ, సుజాత పాల్గొన్నారు.

విద్యానగర్‌లో అంబళం పూజ

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్‌లో శనివారం రాత్రి అంబళం పడిపూజ జరిగింది. కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అయ్యప్ప భక్తులు మెట్ల పూజ చేశారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకాడు దర్గావీధికి చెందిన షేక్ కాలేషా(47) అనారోగ్యంతో మృతి చెందడంతో ఆయన కుటుంబసభ్యులకు ముస్లిం ఐక్యవేదిక సభ్యులు శనివారం రూ.37,700 అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం ఐక్యవేదిక కమిటీ అధ్యక్షుడు రహంతుల్లా, ఉపాధ్యక్షుడు మస్తాన్, ప్రధాన కార్యదర్శులు ఫయాజ్, రహీం, అక్బర్, ట్రెజరర్ జిలానీబాషా తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో రూ.1.40 లక్షల జరిమానా

నాయుడుపేట టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందికి నాయుడుపేట జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షి సుందరి రూ.1.40 లక్షల జరిమానా విధించినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. శనివారం మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 14 మందిపై కేసు నమోదు చేసి న్యాయస్థానంలో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

ఎస్‌ఐగా నిఖిల్ బాధ్యతల స్వీకరణ



వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకాడు ఎస్‌ఐగా నిఖిల్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. వాకాడు పోలీసు స్టేషన్‌లో ట్రైనీ ఎస్‌ఐగా ఉన్న ఆయన రెగ్యులర్ ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్‌ఐ నాగబాబు తిరుపతి వీఆర్‌కు బదిలీ అయ్యారు.





గోతులమయంగా ఉన్న కొరిడి - పేర్నాడు రోడ్డు - ఇటీవల కురిసిన వర్షానికి బురదమయంగా మారిన వేనాడు రోడ్డు

అధ్వానంగా కొరిడి - పేర్నాడు రోడ్డు

నరకంగా మారిన ప్రయాణం

సూళ్లూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి పులికాట్ పల్లెలకు వెళ్లే కొరిడి - పేర్నాడు రోడ్డు అధ్వానంగా మారింది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే మార్గంలో అట్టకానితిప్ప వద్ద నుంచి పులికాట్ సరస్సు మధ్యలో 9 కిలో మీటర్ల మేర గ్రావెల్ రోడ్డు వుంది. ఈ దారిలో కొరిడి, కడపత్ర, దామరాయి మూడు పంచాయతీల్లో 23 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రోడ్డుపై నీళ్ల నిలచి అడుగడుగునా గోతులు ఏర్పడడంతో ప్రయాణం నరకంగా మారింది. ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. తడ మండలం వేనాడు దీవికి వెళ్లే రోడ్డు పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇక్కడ ప్రసిద్ధి గాంచిన దర్గా, శృంగీశ్వర శ్రీరంగ పెరుమాల్ ఆలయం ఉంది. ఇక్కడకి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు, సందర్శకులు వచ్చి పోతుంటారు. ఈ రోడ్డులో గమ్యం చేరేవరకు గగనమే. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అసెంబ్లీలో ఈ రోడ్ల గురించి ప్రస్తావించినా నేటికీ మోక్షం కలగలేదు.

సమన్వయంతో సమస్యలను పరిష్కరించాలి



ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

దొరవారిసత్రం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుని అధికారులు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. శనివారం దొరవారిసత్రంలో మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. 57 మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు. ఇందులో గ్రామాల్లో రోడ్ల కోసం 21 వినతులు వచ్చాయి. రెవెన్యూ సమస్యలు 13, ఎంపీడీవో కార్యాలయంలో పనుల కోసం 4, అగ్రికల్చర్ 3, ఇరిగేషన్ 3, ఆర్‌అండ్‌బీ రోడ్ల కోసం 3, ఇతర సమస్యలపై మరో 10 వినతులు వచ్చాయి. వాటన్నింటినీ ఆయా శాఖల అధికారులు అందజేసి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, ఎంపీడీవో గోవర్దన్, తహసీల్దారు శైలాకుమారి, వివిధ శాఖల అధికారులతో పాటు టీడీపీ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు నాయుడు, మురళీరెడ్డి, ఇట్టగుంట రత్నయ్య, రమణయ్య, కృష్ణమూర్తి, జాన్ రమేష్, జకరయ్య, చంద్రయ్యనాయుడు షబ్బీర్, పాముంజి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గూడూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) స్థానిక నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో శనివారం ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఒకటవ పట్టణ ఎస్‌ఐ మనోజ్ కుమార్ వివరాల మేరకు... నారాయణ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలోని చల్లకాలువ వాగునుంచి కొట్టుకుని వచ్చిన మృతదేహం చెట్ల పొదల్లో ఇరుక్కుని ఉందన్నారు. మృతుడి వయస్సు ముప్పై ఐదు సంవత్సారాల లోపు ఉండవచ్చునని తెలపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం

సూళ్లూరుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని భవిత కేంద్రంలో శనివారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఎంఈవో శీనయ్య మాట్లాడుతూ దివ్యాంగులు బలహీనులు కాదని, వారిలో ప్రతిభను గుర్తించి తీర్చిదిద్దితే అత్యున్నత స్థానాలకు ఎదుగుతారన్నారు. అనంతరం క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మృదుల, ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు ఆలపాటి అశోక్, లలిత, అలవల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో డీఎంహెచ్‌వో తనిఖీలు



బాలిరెడ్డిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎం అండ్ హెచ్‌వో బాలకృష్ణ నాయక్

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాలిరెడ్డిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య అధికారి బాలకృష్ణ నాయక్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులను, మందులను పరిశీలించారు. వైద్యులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో మౌలిక సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నామన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు.

నీటి సరఫరాకు చర్యలు

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టినట్లు తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. శనివారం ఆమె మాట్లాడుతూ తుఫాను కారణంగా గ్రామానికి తాగునీరు అందించే పైప్‌లైన్ మరమ్మతులకు లోను కావడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పైప్‌లైనుకు మరమ్మతులు చేపట్టి నీటి సరఫరా పునరుద్దరిస్తామని చెప్పారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

గూడూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు నిబంధనలు పాటించకుంటే చర్యలు చేపడుతామని రూరల్ ఎస్‌ఐ తిరుపతయ్య అన్నారు. శనివారం జాతీయ రహదారి పోటుపాళెం కూడలి వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలు నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తగిన ధృవీకరణ పత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

కేసు నమోదు

బాలాయపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పచ్చారు చేను గ్రామంలో ఇంటి స్థలం విషయమై చంద్రగిరి అంకమ్మ అనే మహిళను అదే గ్రామానికి చెందిన నర్రావుల మనోహర్ నాయుడు, ఆయన కుమారులు నరేష్, మునిరాజ దాడి చేశారు. అంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

విద్యార్థులు బాధ్యతతో మెలగాలి

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాధ్యతతో మెలగాలని సీఐ రమణ అన్నారు. శనివారం వేదాంత్ కళాశాలల్లో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మంచి, చెడు ఉంటాయని, విద్యార్థులు సన్మార్గంలో నడవడం అలవాటు చేసుకోవాలన్నారు. మైనర్లు వాహనం నడపం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారన్నారు. రాజావీధిలో వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ రమణయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రమణ





గూడూరు, సూళ్లూరుపేటల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు సునీల్‌కుమార్, ఎమ్మెల్యే విజయశ్రీ

ఆదర్శనీయుడు అంబేడ్కర్

గూడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆర్థిక అసమానతలను రూపుమాపేందుకు ఎంతో కృషిచేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అశోక్‌నగర్‌లో నీళ్లట్యాంకు సమీపంలో గల అంబేడ్కర్ విగ్రహానికి అంబేడ్కర్ సేవా సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేగూరు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, కొత్తపల్లి వసంత్‌కుమార్, ప్రతాప్, మనపాటి శ్రీను, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు. కోర్టు ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకటనాగ పవన్‌కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బీ.సులోచనారాణి, న్యాయవాదులు అరవపార్వతయ్య, మెహబూబ్‌బాషా, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: పట్టనంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ పూలమాలవేసి నివాళులర్పించారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, బుజ్జయ్య, పెంచలయ్య, రమణయ్య, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, మునస్వామి, జయచంద్ర, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, రఫీ, జీవీఆర్ నాయుడు, రాజేంద్ర, లక్ష్మయ్య, నిత్య కృష్ణారెడ్డి, సుబ్బారావు, పొట్లపూడి రాజేష్, ధనంజయ, నాగరాజు, మస్తాన్, షైలారి రాజశేఖర్, జయరామయ్య, గోపి తదితరులు పాల్గొన్నారు.





గూడూరు కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయమూర్తులు వెంకటనాగ పవన్‌కుమార్, సులోచనారాణి - నాయుడుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి నెలవల సుబ్రహ్మణ్యం నివాళులు

స్వర్ణముఖి నదిలో తగ్గని వరద ఉధృతి



రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల మధ్య మామిడికాలువ పొంగడంతో తెగిపోయిన్న రోడ్డు

కోట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, రుద్రవరం, తిన్నెలపూడి వద్ద స్వర్ణముఖినదిలో శనివారం కూడా వరద ఉధృతి తగ్గలేదు. ఎగువ ప్రాంతాల నుంచి స్వర్ణముఖిలోకి వదర వస్తుండటంతో నదిలో ప్రవాహం తగ్గలేదు. ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాల మీదుగా వెళ్లే మామిడికాలువ వరదనీటితో ఉప్పొంగడంతో రెండుచోట్ల ఆర్‌అండ్‌బీ రోడ్డు పూర్తిగా తెగిపోయి గండ్లు పడ్డాయి. దీంతో ఊనుగుంటపాళెం, రుద్రవరం గ్రామాలకు ఐదు రోజుల నుంచి దారి సౌకర్యం లేదు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ జడ్జి విష్ణువర్మ

వెంకటగిరి టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని వెంకటగిరి సివిల్ జడ్జి విష్ణువర్మ కోరారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 13వ తేదీన నిర్వహించే లోక్‌అదాలత్‌లో కక్షిదారులు రాజీమార్గం ఎంచుకునేలా పోత్సహించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ సభ్యులు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన



టీడీపీ కార్యాలయ నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న నెలవల సుబ్రహ్మణ్యం, పార్టీ నాయకులు

నాయుడుపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కార్యాలయ నిర్మాణం కోసం నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం శనివారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దారు రాజేంద్రతో కలసి నాయుడుపేట - శ్రీకాళహస్తి బైపాస్‌రోడ్డు సమీపంలో భూమిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్, నాయకులు రఫీ, జీవీఆర్ నాయుడు, రాజేంద్ర, లక్ష్మయ్య, నిత్య కృష్ణారెడ్డి, సుబ్బారావు, పొట్లపూడి రాజేష్, ధనంజయ, నాగరాజు, మస్తాన్, షైలారి రాజశేఖర్, జయరామయ్య, గోపి, ఎన్‌సీఆర్ తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ ధారణ తప్పనిసరి

పెళ్లకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ నాగరాజు అన్నారు. శనివారం రాత్రి తాళ్వాయిపాడు సమీపంలోని అండర్ పాస్ వద్ద హెల్మెట్ లేకపోవడంతో జరిగే నష్టాలను వివరిస్తూ రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, మొబైల్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్లే ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలి

గూడూరు అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని, లేని పక్షంలోజిల్లా కేంద్రంగా ప్రకటించాలని ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అన్నారు. శనివారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పోస్టుకార్డుల ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరు ప్రజల ఆకాంక్షను ముఖ్యమంత్రికి తెలియజేయడానికి పోస్టుకార్డులు పంపడం జరిగిందన్నారు. ఎన్నికల సమయంలో సీఎం ఇచ్చిన హామీని నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభు, వాసుదేవరావు, సుబ్రహ్మణ్యం, దాసు, సునీల్, సిరాజ్, అనిల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

వాకాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాకాడు ముస్లిం కాలనీకి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ కాలేషా అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని పార్టీ నాయకులు పరామర్శించారు. అంత్యక్రియల నిమిత్తం టీడీపీ నాయకులు సన్నారెడ్డి విజయశేఖర్‌రెడ్డి సమకూర్చిన రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో షేక్ రహంతుల్లా, మీరామోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్ప్రేయర్ల పంపిణీ

పెళ్లకూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వ్యవసాయ ఉత్పత్తిదారులు, సహకార సంఘాల్లో సభ్యులైన చెందిన 40 మంది రైతులకు తహసీల్దార్ హరికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య స్ప్రేయర్లు అందజేశారు. శనివారం పెళ్లకూరు వెలుగు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీసీ నారాయణ, వెలుగు సీసీలు కుమార్, రమణయ్య, నాగమణి, ఉషా, సురేఖ, స్వప్న, వజ్రమ్మ తదితరులు పాల్గొన్నారు.